బుధవారం
30-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 158
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మెరుగైన భవితవ్యాన్ని కలిసి నిర్మించుకుందాం

అన్ని రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని, ఆధునికీకరణ కోసం కలిసి పనిచేయాలని, మెరుగైన భవిష్యత్‌ను కలిసి నిర్మించుకోవాలని చైనా, మంగోలియా దేశాధ్యక్షులు జిన్‌పింగ్, ఖురేల్సుక్ సంకల్పించారు.

2లో

అత్యధిక సంపద వీరిద్దరి చేతుల్లోనే

కుబేరులు అదానీ... అంబానీయే!

- ఫోర్బ్స్ 2022 ధనవంతుల జాబితాలో స్థానం
- ప్రపంచ జాబితాలో ఎలన్ మస్క్‌కు అగ్రస్థానం
- భారత జాబితాలో మరో 10 మంది

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత దిగ్గజ వ్యాపారవేత్తల సంపద మరింత పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల వార్షిక ర్యాంకింగ్ ముగిసింది. అనేక మంది భారత వ్యాపారవేత్తలు జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, రూపాయి క్షీణత, ఉద్యోగ కోతలు వంటి భయాలు నెలకొన్నాయి. అదే సమయంలో భారతదేశంలో కుబేరుల సంపద రోజురోజుకూ పెరుగుతోంది. దేశంలో టాప్-100 సంపన్నుల మొత్తం సంపద విలువ 800 బిలియన్ డాలర్లకు (రూ.62 లక్షల కోట్లు పైనే) చేరింది. ఈ ఒక్క ఏడాదిలోనే వీరి సంపద 25 బిలియన్ డాలర్లు మేర పెరిగిందని ఫోర్బ్స్ వెల్లడించింది. ఈ మేరకు టాప్-100 జాబితాను వెలువరించింది. ఈ జాబితాలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అగ్రస్థానంలో నిలవగా... ముకేశ్ అంబానీ రెండవ స్థానంలో నిలిచారు. నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణీ నాయర్ తొలిసారి ఈ జాబితాలో చోటు దక్కించుకోగా... పేటీఎం సీఈవో విజయ్ శేఖర్

- మిగతా 2 లో

టీచర్లకు ఉపశమనం

- బోధనేతర పనులకు దూరం
- విద్యా కార్యక్రమాలకే పరిమితం
- జగన్ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగింది. ఇంతకాలం ఉపాధ్యాయులపై ప్రభుత్వాలు అనేక భారాలు మోపుతున్నాయి. ఈ భారాలకు స్వస్తి చెబుతూ జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయిస్తూ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీజేశారు. ఇక నుంచి ఉపాధ్యాయులను బోధన పనులకే కేటాయించనుంది. వర్చువల్‌గా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నిర్ణయానికి ఆమోదముద్ర వేసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నికల విధులు, జనాభా గణన తదితర అంశాల్లో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులపై అధికభారం పడుతోంది. దీనివల్ల విద్యార్థులకు నాణ్యత గల విద్యను అందించలేకపోతున్నారు. బోధనేతర పనుల నుంచి తమను మినహాయించాలని ఉపాధ్యాయులు, వివిధ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి చాలాకాలంగా విన్నవిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఉపాధ్యాయులు ఇక విద్యార్థులకు పాఠాలు చెప్పే పనులకే పరిమితమవుతారు. ప్రభుత్వం జారీజేసిన ఉత్తర్వుల్లో ఉపాధ్యాయులను ఏఏ పనుల నుంచి మినహాయించారనే అంశంపై స్పష్టమైన విధివిధానాలు లేవు. ఉపాధ్యాయులు తమ తరగతికి సంబంధించి పిల్లల విద్యాస్థాయిలను మెరుగుపరచడానికి బోధనకే సమయాన్ని కేటాయించాలని, టీచర్లను బోధనకు మరింత అంకితం చేయాలని నిర్ణయించింది. ఇతర ప్రభుత్వ విభాగాల సిబ్బందిని నియమించాకే ఉపాధ్యాయులను విద్యాపరమైన కార్యకలాపాల్లో నియమిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఉపాధ్యాయులు ఎన్నికల విధులు, జనాభా లెక్కలు, వివిధ సర్వేలు తదితర విధుల్లో నిమగ్నమయ్యేవారు. ప్రభుత్వ ఉత్తర్వులతో ఇకనుంచి ఆ పనులకు ఉపాధ్యాయులు దూరమవుతారు.

ఎన్నికల విధులకు దూరం చేయదానికేనా: ఎస్టీయూ

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆహ్వానించింది. ఈ మేరకు ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక వివిధ సంక్షేమ పథకాల నిర్వహణలోనూ ఉపాధ్యాయులు భాగస్వాములవుతున్నారని వివరించారు. నిత్యం యాప్‌లతో సమాచారం

- మిగతా 2 లో

నూతన సీఎస్ జవహర్‌రెడ్డి

- సీఎంవో ప్రత్యేక సీఎస్‌గా పూనం మాలకొండయ్య
- ఎక్స్ అఫీషియో చీఫ్ సెక్రటరీగా సమీర్‌శర్మ
- కొంతమంది ఐఏఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ఆర్.ముత్యాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనుండటంతో ఆయన స్థానంలో జవహర్‌రెడ్డిని నియమించారు. ప్రస్తుత సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జవహర్‌రెడ్డి...ఈనెల 30వ తేదీ సాయంత్రం నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. 1990వ బ్యాచ్‌కి చెందిన జవహర్‌రెడ్డి 2024 వరకు పదవిలో కొనసాగుతారు. ఆయన కంటే సీనియర్లుగా ఉన్న నీరబ్‌కుమార్ (1987), పూనం మాలకొండయ్య (1988), కరికాల్ వలెవన్ (1989) సీఎస్ పోస్టును ఆశించినప్పటికీ సీఎస్‌గా జవహర్‌రెడ్డినే ప్రభుత్వం నియమించింది.

సమీర్‌శర్మ కోసం కొత్త పోస్టు సృష్టి

సీఎస్‌గా పదవీ విరమణ చేయనున్న సమీర్‌శర్మ కోసం జగన్ ప్రభుత్వం కొత్త పోస్టు సృష్టించింది. ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో చీఫ్ సెక్రటరీగా సమీర్‌శర్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీజేసింది. ఆయన కోసం సీఎం కార్యాలయంలో ఈ పోస్టు సృష్టించారు. ప్రణాళికా విభాగం ఎక్స్‌అఫీషియో కార్యదర్శిగా ఉన్న విజయ్‌కుమార్ బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. అటు విజయ్‌కుమార్ కోసం కూడా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సొసైటీ సీఈవోగా ప్రభుత్వం మరో నూతన పోస్టును ఏర్పాటు చేసింది. కాగా, రాష్ట్రంలో కొంతమంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సీఎం స్పెషల్ సీఎస్‌గా

- మిగతా 2 లో

రూ.2వేల కోట్లపై జేపీసీతో దర్యాప్తు

సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం డిమాండ్

ఆర్థిక మంత్రి సీతారామన్‌కు లేఖ

న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (డీహెచ్ఎఫ్ఎల్) సెక్యూరిటీస్‌లో యూటీఐ ఆస్తుల నిర్వహణ కంపెనీ (యూటీఐ-ఏఎంసీ) రూ.2వేలకోట్ల పెట్టుబడిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణకు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. కుంభకోణం జరిగిన క్రమంలో డీహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్లు, డైరెక్టర్లను సీబీఐ, ఈడీ విచారిస్తున్నాయి. 17 బ్యాంకుల నుంచి రూ.34,615 కోట్లు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు దేశంలో జరిగిన అతిపెద్ద కుంభకోణం ఇదే.

డీహెచ్ఎఫ్ఎల్ కుంభకోణంపై దర్యాప్తు వివరాల కోసం పౌరులంతా వేచివుండగా ఆ సంస్థలో రూ.2వేలకోట్ల పెట్టుబడిని యూటీఐ-ఏఎంసీ పెట్టడంపై దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్ అవసరమని లేఖలో విశ్వం నొక్కిచెప్పారు. 'ఈ కుంభకోణం తర్వాత డీహెచ్ఎఫ్ఎల్ సెక్యూరిటీలో పెట్టుబడులను మొత్తం మ్యూచువల్ ఫండ్ వ్యవస్థ ఆపినట్లుగా ఉంది. యూటీఐ-ఏఎంసీ నిర్ణయాల గురించి సమాచారం ప్రజలకు తెలియకుండా యూటీఐ-ఏఎంసీ, యూటీఐ ట్రస్టీ కంపెనీ, సెబీ అడ్డుకున్నాయి' అని విశ్వం పేర్కొన్నారు. 'యూటీఐ-ఏఎంసీని ప్రజలు విశ్వసించారు. తమ కష్టార్జితం దోపిడీకి గురవదని నమ్మారు. కాబట్టి అందుకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు జరిపించాలి' అని ఎంపీ డిమాండ్ చేశారు. పెద్దమొత్తంలో ఉన్న ప్రజాధనం, భారతీయ ఆర్థిక నిర్వహణ వ్యవస్థ ప్రతిష్ఠ పణంగా ఉండటం దృష్ట్యా ఈ వ్యవహారానికి ప్రభుత్వం ప్రాధానత ఇస్తుదని భావిస్తున్నా' అని తన లేఖలో విశ్వం పేర్కొన్నారు.

ఆందోళనలు జయప్రదం చేద్దాం

- 5న జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల విజ్ఞాపనలు
- 12న రైతాంగ సమస్యలపై ధర్నాలు
- 9 నుంచి కడప స్టీలు ప్లాంట్ కోసం పాదయాత్రలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డిసెంబరులో సీపీఐ తలపెట్టిన పోరుబాటను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాలు సన్నద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం ఆన్‌లైన్ ద్వారా జరిగింది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా, నగర, పట్టణ కార్యదర్శులు పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ ముందువరుసలో నిలుస్తోందన్నారు. డిసెంబరు 26న పార్టీ వార్షికోత్సవానికి ముందు నుంచే ప్రజాసమస్యలపై సీపీఐ, ప్రజాసంఘాలు తలపెట్టిన ఉద్యమాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. జగనన్న కాలనీలలో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు విజ్ఞాపనల కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. 32లక్షల మంది లబ్ధిదారులు, కోటి 50 లక్షల మంది జనాభాతో ఈ సమస్య ముడిపడి ఉందన్నారు. తొలుత సీఎం జగన్ లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తామని చెప్పారని, చివరికి లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలని చెప్పడం సరికాదన్నారు. ఇళ్లు కట్టుకున్న కొద్దిమంది లబ్ధిదారులకు సైతం బిల్లులు

- మిగతా 2 లో

డ్రైవింగ్ సీట్లో ఉండగానే

క్రేన్‌తో స్టేషన్‌కు తరలింపు

- ప్రగతిభవన్ ముట్టడికి షర్మిల యత్నం
- పాదయాత్రను అడ్డుకున్నందుకు నిరసన
- మూడు సెక్షన్ల కింద కేసు నమోదు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణిచివేత ధోరణిని నిరసిస్తూ వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ప్రగతిభవన్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం ఆమెను అరెస్ట్ చేసిన పోలీసులు లోటస్ పాండ్‌కు తరలించారు. అయితే లోటస్ పాండ్ వద్ద ఉన్న పోలీసుల కళ్లుగప్పి ఆమె ధ్వంసమైన వాహనంలోనే ప్రగతి భవన్‌కు బయలుదేరి వెళ్లారు. పోలీసులు పంజాగుట్ట చౌరస్తా వద్ద ఆమెను అడ్డుకున్నారు. షర్మిల డ్రైవింగ్ సీట్లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

హమ్మయ్యా!

ఆధార్ లేకుంటే

అన్నం పెట్టం!

- బడుల్లో పిల్లలకు భోజనం నిలిపివేస్తాం
- స్కూల్ యూనిఫాంలూ ఇవ్వం
- మహారాష్ట్రలో జనవరి నుంచి అమలు
- బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం నిర్ణయం
- లక్షల మంది విద్యార్థులపై ప్రభావం

2లో

వివేకా హత్యకేసు విచారణ తెలంగాణకు బదిలీ



ఢిల్లీ: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తును ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణాకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్న ప్రాంతంలో న్యాయమైన విచారణ అసంభవమని వ్యాఖ్యానించింది. భారీకుట్ర, సాక్ష్యాధారాల ధ్వంసంపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని సీబీఐకి నిర్దేశిస్తూ జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్ల ధర్మాసనం తుదితీర్పు ఇచ్చింది. 2019 మార్చిలో తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణపై పలు అనుమానాలు ఉన్నాయని, కేసు దర్యాప్తు సజావుగా సాగడం లేదని, దర్యాప్తు సంస్థ విచారణాధికారులపై ప్రైవేట్ కేసులు పెట్టి అడ్డంకులు సృష్టిస్తున్నారని, కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని వైఎస్ సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దర్యాప్తు ప్రాంతంలో న్యాయమైన విచారణ అసంభవం

ఈ ఏడాది ఏప్రిల్ 13న సునీత క్రిమినల్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమె పిటిషన్‌పై సుప్రీంకోర్టు సీబీఐ అభిప్రాయం కోరింది. ఈ కేసులో సునీతా చెప్పినవన్నీ నిజాలే అని కోర్టులో దాఖలు చేసిన కౌంటర్లో సీబీఐ అంగీకరించింది. దీనిపై విచారణ పూర్తి చేసి రిజర్వ్‌లో ఉంచిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్న ప్రాంతంలో న్యాయమైన విచారణ అసంభవం అని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్

- మిగతా 2 లో

తెనాలిలో అరసం రాష్ట్ర మహాసభలు

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 19వ మహాసభలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 11,12 తేదీల్లో తెనాలిలో నిర్వహించేందుకు మంగళవారం ఆహ్వాన సంఘం ఏర్పడింది.

2లో

మెరుగైన భవితవ్యాన్ని కలిసి నిర్మించుకుందాం

మంగోలియా-చైనా అధ్యక్షుల సంకల్పం

బీజింగ్: అన్ని రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని, ఆధునికీకరణ కోసం కలిసి పనిచేయాలని, మెరుగైన భవిష్యత్‌ను కలిసి నిర్మించుకోవాలని చైనా, మంగోలియా దేశాధ్యక్షులు జిన్‌పింగ్, ఖురేల్సుక్ సంకల్పించారు. పరస్పరం తమ దేశాల స్వాతంత్య్రాన్ని, సార్వభౌమత్వాన్ని గౌరవించుకోవాలని, సహకారాన్ని పెంచుకుంటూ మిత్రబంధాన్ని పటిష్టపర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. సహకారాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని, మంచి పురోగతి సాధించి దేశాల మధ్య బంధానికి ప్రతీకగా నిలవాలని ఇద్దరు అధ్యక్షులు ఆకాంక్షించారు. చైనా పర్యటనలో ఉన్న మంగోలియా అధ్యక్షుడు ఉఖ్‌నాగిన్ ఖురేల్సుక్‌తో గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జిన్‌పింగ్ భేటీ అయ్యారు. ఖురేల్సుక్‌కు ఘనంగా స్వాగతం పలికారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపర్చుకునే దిశగా రెండు నెలల్లో ఇది రెండవ భేటీ అని ఇద్దరు అధ్యక్షులు గుర్తుచేసుకున్నారు. పొరుగు దేశాల మధ్య పరస్పర సహకారం, సుదీర్ఘ-సుస్థిర సత్సంబంధాలు ముఖ్యమని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. కోవిడ్‌పై పోరులో పరస్పరం సహకరించుకున్నామన్నారు. అంతర్జాతీయ పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనే దిశగా మంగోలియాతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉన్నదని జిన్‌పింగ్ తెలిపారు. రెండు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, సుస్థిరాభివృద్ధితో ప్రజలకు దీర్ఘకాలిక ఫలాలు లభిస్తాయని ఆకాంక్షించారు. కలిసికట్టుగా కొత్త తరహా అంతర్జాతీయ సంబంధాలు, మానవాళి భవిష్యత్ కోసం ఒక సంఘం (కమ్యూనిటీ)గా సాగుదామన్నారు. ప్రాదేశిక సమగ్రతను గౌరవించుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలని జిన్‌పింగ్ అన్నారు. అలాగే, బెల్ట్ అండ్ రోడ్, ప్రపంచ అభివృద్ధి, రోడ్ల అభివృద్ధి తదితర పథకాలతో పాటు మంగోలియా కొత్త రికవరీ విధానం, సుదీర్ఘ అభివృద్ధి విధానానికి సంబంధించి విజన్-2050కు రెండు దేశాలు కట్టుబడి ఉంటాయన్నారు. ఆర్థిక సహకారంతో పాటు వాణిజ్యం, ఇంధనం, మైనింగ్, కనెక్టివిటీ (అనుసంధానం), సమాచార సాంకేతిక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని, ఇందుకు చైనా సిద్ధమని జిన్‌పింగ్ తెలిపారు. బిలియన్ మొక్కలు నాటే మంగోలియా కార్యక్రమాన్ని కొనియాడారు. విద్య, ఆరోగ్యం, వైద్యం, మీడియా, పర్యాటకం, శాస్త్రీయ-సాంకేతిక రంగాల్లోనూ రెండు దేశాలకు లబ్ధిచేకూరేలా బంధాన్ని బలపర్చుకోవాలని జిన్‌పింగ్ చెప్పగా ఖురేల్సుక్ అంగీకరించారు.

షెంఝౌ 15ను ప్రయోగించిన చైనా

బీజింగ్: మానవసహిత మూన్ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి చైనా పంపింది. చైనా అంతరిక్ష కేంద్రం నిర్మాణం పూర్తి కానున్న తరుణంగా ఈ మిషన్‌కు ప్రాధాన్యత నెలకొంది. అమెరికా తర్వాత సొంత అంతరిక్ష కేంద్రంగల దేశంగా చైనా నిలవబోతోంది. ముగ్గురు వ్యోమగాములు అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి అవసరమైన తుది దశ పనులు పూర్తి చేస్తారనిచైనా ప్రకటించింది. షెంఝౌ-15 అంతరిక్ష నౌకను జిక్వాన్ ఉపగ్రహాల ప్రయోగ కేంద్రం నుంచి మంగళవారం ఉదయం 10 గంటలప్పుడు (స్థానిక కాలమానం ప్రకారం) ప్రయోగించినట్లు చైనా మానవసహిత అంతరిక్ష కేంద్రం (సీఎంఎస్‌ఏ) ప్రకటించింది. ముగ్గురు వ్యోమగాములు ఫీ జుంగ్లాంగ్, డెంగ్ క్వింగ్‌మింగ్, జాంగ్లు మిషన్‌లో ఉన్నారని, కమాండర్‌గా ఫీ జుంగ్లాంగ్ వ్యవహరిస్తారని తెలిపింది. ఈ మిషన్‌తో అంతరిక్ష కేంద్రం నిర్మాణం తుది దశ పూర్తి అవుతుందని సీఎంఎస్‌ఏ డైరెక్టర్ జీ కిమింగ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ప్రభుత్వ ఏర్పాటుకు మిత్రపక్షాలతో నేపాలీ కాంగ్రెస్ చర్చలు

ఖాట్మండు: నేపాల్‌లో మరోమారు నేపాలీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. పార్లమెంటు- ఏడు అసెంబ్లీల ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చివరి దశకు చేరింది. ఈ వారంలో ప్రక్రియ మొత్తం పూర్తి కానున్నది. ఇప్పటివరకు 158 స్థానాల ఫలితాలు వెలువడగా నేపాలీ కాంగ్రెస్ కూటమి సత్తా చాటింది. మరో ఏడు స్థానాల ఫలితాలు మాత్రమే వెలువడాల్సి ఉంది. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా ఈ పార్టీ అడుగులు వేస్తోంది. తమ భాగస్వామ్య పార్టీలతో కలిసి అధికారాన్ని పంచుకోవడంపై చర్చోపచర్చలు జరుపుతోంది. ఏదేని పార్టీకి మెజారిటీ రావాలంటే 275 సభ్యులలో కనీసం 138స్థానాల్లోగెలవాలి. నేపాలీ కాంగ్రెస్ నేతృత్వ కూటమిలో సీపీఎన్-మావోయిస్ట్ సెంటర్, సీపీఎన్-యూనిఫైడ్ సోషలిస్ట్, లోకతాంత్రిక్ సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనమోర్చా ఉన్నాయి. ఈ కూటమి ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రతినిధుల సభలో 85 స్థానాలను గెలుచుకుంది. ప్రతిపక్ష సీపీఎన్-యూఎంఎల్ నేతృత్వ కూటమిని 56 స్థానాలు వరించాయి. ఇందులో 42 స్థానాల్లో సీపీఎన్-యూఎంఎల్ గెలవగా, మిత్రపక్షాలైన రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పీపీ), జనతా సమాజ్‌వాదీ పార్టీ (జేఎస్పీ) చెరో ఏడు స్థానాలను గెలుచుకున్నాయి.

ఫ్రాన్స్ రాజ్యాంగంలోకి గర్భవిచ్ఛితి హక్కు బిల్లుకు దిగువసభ ఆమోదం

పారిస్: తమ దేశ రాజ్యాంగంలో గర్భవిచ్ఛితి హక్కును చేర్చే దిశగా ఫ్రాన్స్ ముందడుగు వేసింది. ఇందుకు సంబంధించిన బిల్లును పార్లమెంటు దిగువ సభలో శాసనసభ్యులు ప్రవేశపెట్టారు. నేషనల్ అసెంబ్లీలో మొత్తం 557 మంది సభ్యులు ఉండగా 337 మంది అనుకూలంగా ఓటు వేయగా 32 మంది వ్యతిరేకించారు. దీంతో బిల్లును సభ ఆమోదం లభించింది. గర్భవిచ్ఛితి హక్కును పొందేందుకు ఫ్రాన్స్ తొలి అడుగు వేయగలిగింది. రాజ్యాంగంలో మార్పులు చేర్పులు చేయాలంటే ముందుగా నేషనల్ అసెంబ్లీ, ఎగువ సభ, సెనేట్ ఆమోదం ఆపై దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.

ఏడాదిలోగా విక్రమ్-1 ప్రయోగం

స్కైరూట్ ఎయిరోస్పేస్ ప్రకటన

హైదరాబాద్: దేశంలోని తొలి ప్రైవేటు క్షిపణి విక్రమ్-ఎస్‌ను ఇటీవల అంతరిక్షంలోకి పంపి రికార్డు నమోదు చేసిన స్కైరూట్ ఎయిరోస్పేస్ మరొక చరిత్రాత్మక ప్రయోగానికి నడుం బిగించింది. మరో ఏడాదిలోగా మరింత పెద్ద రాకెట్‌గా విక్రమ్-1ను అంతరిక్షంలోకి పంపాలని యోచిస్తోంది. అంతరిక్ష యానానికి అయ్యే ఖర్చునూ తగ్గించాలని కూడా హైదరాబాద్‌కు చెందిన ఈ సంస్థ భావిస్తోంది. విక్రమ్-ఎస్ విజయంతో పెద్ద రాకెట్‌గా విక్రమ్-1 ప్రయోగానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. తద్వారా మరిన్ని ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యల్లో ప్రవేశపెట్టగలిగే ప్రపంచంలోని కొద్ది సంస్థల్లో ఒకటిగా నిలవాలని భావిస్తున్నాం. మరో ఏడాదిలోగా విక్రమ్-1ను ప్రయోగించాలని లక్ష్యం పెట్టుకున్నాం' అని స్కైరూట్ సహ-వ్యవస్థాపకుడు పవన్ చందన తెలిపారు. తమ సంస్థ 68 మిలియన్ డాలర్లను సమకూర్చిందని, ఇది దేశీయ ఎయిరోస్పేస్ స్టార్టప్ వ్యవస్థలో అత్యధికమన్నారు. ఈ నిధి సేకరణకు నాలుగేళ్లు పట్టిందని చెప్పారు. భవిష్యత్ కోసం మరింతగా నిధి సమీకరణ కొనసాగుతుందన్నారు. అంతరిక్ష ప్రయాణం ఖర్చులో కూడుకున్నది కాబట్టి దీని వ్యయాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 'అంతరిక్ష ప్రయాణం చాలా ఖరీదైనది. ఎందుకంటే రాకెట్లు కొన్నిసార్లు పనిచేయవు. అవి సముద్రంలో కూలిపోతాయి. వ్యర్థమవుతాయి' అని చెప్పారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అంతరిక్ష ప్రయాణాన్ని అందుబాటులోకి తెస్తున్నారని, అది నిజంగా జరగాలంటే భారతీయ దృక్పథంలో పదేళ్లకుపైగా పట్టవచ్చని పవన్ అభిప్రాయపడ్డారు.

తెనాలిలో అరసం రాష్ట్ర మహాసభలు

- ఆహ్వాన సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 19వ మహాసభలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 11,12 తేదీల్లో తెనాలిలో నిర్వహించేందుకు మంగళవారం ఆహ్వాన సంఘం ఏర్పడింది. ప్రముఖ చలన చిత్ర సంభాషణల రచయిత, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బుర్రా సాయిమాధవ్ అధ్యక్షునిగా, అరసం గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు ప్రధాన కార్యదర్శిగా, ఆర్.వడ్లమూడి గౌరవాధ్యక్షునిగా ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. కొత్తపేట అదితి కాన్ఫరెన్స్ హాలులో చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. విశ్రాంత ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ 1943 ఫిబ్రవరి 13,14 తేదీల్లో తెనాలిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిందని, మరలా తెనాలిలో 80 సంవత్సరాల తరువాత ఈ రాష్ట్ర మహాసభలు జరగడం ముదావహమని, సభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1943లో ఇదే తేదీల్లో అరసం పితామహుడు తాపీ ధర్మారావు అధ్యక్షతన ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల మహాసభలు జరిగినట్లు తెలిపారు. తెలుగు నేలపై ప్రగతిశీల దృక్పథంతో ఏర్పడిన తొలి సాహితీ సంస్థ అరసం సమాజ ఉన్నతీకరణకు సాహిత్యం ఎంత దోహదపడుతుందో 80 సంవత్సరాల అరసం ఉద్యమ ప్రస్థానమే చెరగని సాక్ష్యం అన్నారు. అనేక భావ రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, సంస్కరణ పునర్వికాస, హేతువాద, ప్రగతిశీల, ఉద్యమాల ఆవిర్భావంలో ప్రధాన భూమిక వహించిన పట్టణం తెనాలి అని తెలిపారు. సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ ఈ మహాసభలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని అన్నారు. అరసం నేత, అభ్యుదయ సాహితీవేత్త కామ్రేడ్ బొల్లిముంత శివరామకృష్ణ సాహిత్య ప్రాంగణం, ప్రజా సాంస్కృతికోద్యమ నేత అమరజీవి నేతి పరమేశ్వరశర్మ సాహిత్య వేదికలుగా నామకరణం చేస్తామని చెప్పారు. సదస్సులు, పుస్తకావిష్కరణలు, రచయితల పాదయాత్ర, కవితా గోష్ఠిలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వివరించారు. మన సమాజంలో ఒక స్తబ్దత ఆవరించిందని, ఈ పరిస్థితుల్లో స్తబ్దత నుంచి చైతన్యం దిశగా సమాజాన్ని నడిపించే బాధ్యత సాహిత్యానిదన్నారు. ఈ నినాదంతో నేడు ఈ మహాసభలను అరసం నిర్వహిస్తుందని తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ గత 80 సంవత్సరాలుగా అరసం నిర్వహించిన కార్యకలాపాలను వివరించారు. అరసం భూస్వామ్య పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద భావనలను, ప్రపంచీకరణ సంస్కృతిని నిరసిస్తూ, ఎదిరిస్తూ పురోగమిస్తూనే ఉందన్నారు. అస్తిత్వవాద ఉద్యమాల్లోని సానుకూల అంశాలను అరసం గౌరవిస్తూ సంఘీభావాన్ని ప్రకటిస్తుందన్నారు. ఈ సభలను విజయవంతం చేసేందుకు అందరూ పట్టుదలతో కృషి చేసి హార్దిక, ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. అరసం కార్యదర్శి కె.శరత్‌చంద్ర మహాసభల నిర్వహణ ఆవశ్యకతలను వివరించారు. సమావేశంలో రచయితలు జగాష్‌వలి, లలితానంద ప్రసాద్, అయినాల మల్లేశ్వరరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, హృదయరాజ్, పరుచూరి వెంకటేశ్వరరావు, బి.వి.రావు, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లేకుంటే అన్నం పెట్టం!

ముంబై: మహారాష్ట్రలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఆధార్ కార్డు లేకుంటే బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకూడదని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధన వచ్చే ఏడాది జనవరి నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది. భోజనంతో పాటు యూనిఫాం వంటి ఇతర సదుపాయాలు కూడా నిలిపివేస్తామని పేర్కొంటూ ఏక్‌నాథ్ షిండే సర్కార్ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఈ నూతన నిబంధన లక్షలాది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. దాదాపు 59 లక్షల మంది చిన్నారులకు ఆధార్ లేకపోవడమో లేదా ఉన్నా వివరాలు తప్పుగా నమోదు కావడం తదితర సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సమాచారం ప్రకారం... ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 2,33,13,762 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 19,55,515 (8 శాతం) మంది పిల్లలకు అసలు ఆధార్ కార్డులే లేవు. 40,01,250 (18 శాతం) విద్యార్థులకు వాలిడ్ ఆధార్ కార్డులు (పేరు, పుట్టిన తేదీ, వంటివి తప్పు ఉండటం) లేవు.

టీచర్ల ఎంపికపైనా ప్రభావం

బడిలో చేరేందుకు ఆధార్ తప్పనిసరి కాదని, అయితే భోజనం, ఇతర సదుపాయాలు పొందాలంటే ఆధార్ తప్పనిసరని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. విద్యార్థులందరూ డిసెంబర్ 20 లోగా ఆధార్ కార్డు పొందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు డెడ్‌లైన్ పెట్టినట్టు ఓ అధికారి పేర్కొన్నారు. ఆధార్ తప్పనిసరితో ప్రతికూల పరిణామాలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి పాఠశాలకు ఉపాధ్యాయుల పోస్టులు కేటాయిస్తారు. ఈ తాజా నిబంధన ఉపాధ్యాయుల ఎంపికపై ప్రభావం చూపుతుందని అంటున్నారు.

ఐక్య ఉద్యమాలు చేద్దాం

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో ఓబులేసు

విశాలాంధ్ర-యాదగిరిగుట్ట: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు కార్మికలోకం సిద్ధం కావాలని ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు పిలుపునిచ్చారు. ఇక్కడ జరుగుతున్న ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలో ఆయన సౌహార్ద సందేశం ఇస్తూ మోదీ పాలన మేడిపండు మాదిరిగా కొన సాగుతున్నదన్నారు. ఆర్థిక సంక్షోభం తీవ్ర స్థాయిలో పెరిగిపోవడంతో బ్రిటన్ ప్రభుత్వం పేకమేడల్లా కూలిపోయిందని, అదే పరిస్థితి భారత్‌లో ఉన్నప్పటికీ ప్రధాని మత రాజకీయాలతో ప్రజలను పక్క దారి పట్టిస్తూ తన పదవిని కాపాడుకుంటున్నాడన్నారు. సాఫ్ట్‌వేర్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని, అమెజాన్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఇతర సంస్థలు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయన్నారు. దీంతో దేశంలో నిరుద్యోగం మరింత పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 13 మంది ప్రధానులు తమ హయాంలో ప్రభుత్వరంగ సంస్థలను నిర్మించగా, ఏనిమిదేళ్లలో మోదీ ఒక్క ప్రభుత్వరంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పైగా తన స్నేహితులకు ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు లేకుంటే సామాజిక న్యాయం ఉండదన్నారు. రిజర్వేషన్లు తొలగించాలన్న ఆర్‌ఎస్‌ఎస్ విధానంలో భాగంగానే మోదీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. వీటన్నిటికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని ఓబులేసు పిలుపునిచ్చారు.

ఆందోళనలు జయప్రదం చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

రాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 2లక్షల మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మూడున్నరేళ్ల నుండి ఇళ్లు స్వాధీనం చేయకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. పార్టీ శ్రేణులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి, వారి సంతకాలతో అర్జీలు తయారుచేసి డిసెంబరు 5న విజ్ఞాపనలు ఇవ్వాలన్నారు.

రైతాంగ సమస్యలపై రామకృష్ణ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతపురము జిల్లాలో పంటనష్టంపై అధికారులు తప్పుడు లెక్కలు చూపడంతో రైతులు అన్యాయానికి గురయ్యారన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 12న జరిగే ధర్నాలలో పార్టీ శ్రేణులు, రైతుసంఘాల నేతలు, రైతులు భాగస్వాములవ్వాలని కోరారు. కడప స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం డిసెంబరు 9 నుంచి 13వ తేదీ వరకు తలపెట్టిన పాదయాత్ర జయప్రదానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో తనతోపాటు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, కడప జిల్లా పార్టీ నాయకత్వం పాల్గొంటుందన్నారు. పాదయాత్రలో యువజన, విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాలని కోరారు. కర్నూలుకు హైకోర్టు అంశంపై జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు పాదయాత్ర ద్వారా అవకాశం ఉంటుందన్నారు. హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామని జగన్ ప్రభుత్వం చెబుతూ...మరోవైపు సుప్రీంకోర్టుకు అమరావతిలోనే కొనసాగిస్తామని చెప్పడం ద్వారా ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్నారు. అమరావతి రాజధాని అంశంపై సుప్రీంకోర్టులో జరిగిన వాదనల్లో హైకోర్టును అమరావతిలోనే ఉంచుతామంటూ ప్రభుత్వ తరపు న్యాయవాది చెప్పారని గుర్తుచేశారు.

నూతన సీఎస్ జవహర్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

పూనం మాలకొండయ్య నియమితులయ్యారు. వ్యవసాయశాఖ ప్రత్యేక సీఎస్‌గా మధుసూదన్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా ప్రవీణ్ ప్రకాశ్, ఆర్అండ్‌బీ కార్యదర్శిగా ప్రద్యుమ్న, వ్యవసాయశాఖ కమిషనర్‌గా రాహుల్ పాండే, గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శిగా మహ్మద్ దివాన్‌ను నియమించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి బుడితి రాజశేఖర్ సెలవు నుంచి తిరిగి వచ్చాక జేఏడీకి రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వులలో స్పష్టం చేశారు.

అత్యధిక సంపద వీరిద్దరి చేతుల్లోనే

(మొదటిపేజీ తరువాయి)

శర్మ తన స్థానాన్ని కోల్పోయారు. అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ సంపద మొత్తం 150 బిలియన్ డాలర్లు (రూ.1,211,460.11 కోట్లు) గా ఫోర్బ్స్ పేర్కొంది. టాప్-100 కుబేరుల మొత్తం సంపద విలువ పెరగడంలో అదానీ పాత్ర కీలకమని తెలిపింది. ఆయన సంపద ఈ ఒక్క ఏడాదిలోనే రెట్టింపు అయిందని ఫోర్బ్స్ వెల్లడించింది. ఈ జాబితాలో ముకేశ్ అంబానీ రెండవ స్థానంలో నిలిచారు. ఆయన మొత్తం సంపద 88 బిలియన్ డాలర్లు (రూ.710,723,26 కోట్లు) గా ఉందని వివరించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆయన సంపద 5 శాతం మేర తగ్గినట్లు తెలిపింది. టాప్-100 మొత్తం సంపదలో అదానీ, అంబానీ వాటానే దాదాపు 30 శాతంగా ఉండటం గమనార్హం. ఇక ఈ జాబితాలో నైకా ఫ్యాషన్స్ వ్యవస్థాపకురాలు ఫల్గుణీ నాయర్ తొలిసారి చోటు దక్కించుకున్నారు. వేదాంత ఫ్యాషన్స్ వ్యవస్థాపకుడు రవి మోదీ, మెట్రో బ్రాండ్ వ్యవస్థాపకుడు రఫిక్ మాలిక్ సైతం తొలిసారి ఈ జాబితాలో చోటు సాధించారు. కాగా రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా మరణంతో ఆయన భార్య రేఖ ఝున్‌ఝున్‌వాలా పేరు ఈ జాబితాలో చేరింది. వీరితో పాటు ఆనంద్ మహీంద్రా, బర్డేశ్ షా, జాయ్ అలుక్కాస్ వంటి వారు తిరిగి జాబితాలో చోటు సాధించారు. పేటీఎం షేర్లు పడిపోయిన నేపథ్యంలో పేటీఎం సీఈవో విజయ్ శేఖర్ శర్మ ఈ జాబితాలో చోటు కోల్పోయారు. జాబితాలో వారి సంపద మొత్తాన్ని పరిశీలిస్తే... గౌతమ్ అదానీ రూ.12,11,460.11 కోట్లు, ముకేశ్ అంబానీ రూ.7,10,723.26 కోట్లు, రాధాకృష్ణ దమానీ రూ.2,22,908.66 కోట్లు, సైరస్ పూనావాలా రూ.1,73,642.62 కోట్లు, శివ్ నాడార్ రూ.1,72,834.97 కోట్లు, సావిత్రి జిందాల్ రూ.1,32,452.97 కోట్లు, దిలీప్ సంఘ్వీ రూ.1,25,184.21 కోట్లు, హిందుజా సోదరులు రూ.1,22,761.29 కోట్లు, కుమార్ బిర్లా రూ.1,21,146.01 కోట్లు, బజాజ్ కుటుంబం రూ.1,17,915.45 కోట్లు.

క్రేన్‌తో స్టేషన్‌కు తరలింపు

(మొదటిపేజీ తరువాయి)

ఉండగానే కారును క్రేన్‌తో తరలించారు. పోలీసుల వైఖరిపై టీవైఎస్‌పీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ట్రాఫిక్ స్తంభించింది.

వరంగల్ జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్రలో భాగంగా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌పై ఆమె కొన్ని వ్యాఖ్యలు చేశారు. తమ ఎమ్మెల్యేను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ షర్మిల పాదయాత్రను టీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని పాదయాత్రను నిలిపివేయాలని షర్మిలను నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు కోరగా ఆమె నిరాకరించారు. ఈ క్రమంలో శంకరాంతండా సమీపంలో షర్మిల వాన్‌పై కొందరు వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు. పక్కనే ఉన్న ఇన్నోవా వాహనం అద్దాలనూ పగులగొట్టారు. అనంతరం షర్మిలను హైదరాబాద్ తరలించారు. ఈ పరిణామాలకు నిరసనగా షర్మిల మంగళవారం ప్రగతిభవన్‌కు బయల్దేరారు. ధ్వంసం చేసిన కారును స్వయంగా నడుపుతూ నిరసనకు వెళ్తుండగా పంజాగుట్ట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వాహనం దిగాలని పోలీసులు కోరినప్పటికీ ఆమె వినలేదు. దీంతో డ్రైవింగ్ సీట్లో షర్మిల కూర్చుని ఉండగానే పోలీసుల క్రేన్‌ను తెప్పించి అక్కడి నుంచి ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో షర్మిలపై మూడు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వీఐపీ రహదారిపై ఆమె హంగామా చేసినందుకు కేసు పెట్టినట్లు సమాచారం.

షర్మిల పాదయాత్రకు హైకోర్టు అనుమతి

వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు హైకోర్టులో మంగళవారం ఊరట లభించింది. పాదయాత్రకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. షర్మిల చేస్తున్న పాదయాత్ర వరంగల్ జిల్లాలో ఉద్రిక్తతకు దారితీయడంతో పోలీసులు అనుమతి రద్దు చేశారు. పాదయాత్రకు ప్రయత్నించిన ఆమెను అడ్డుకున్న నర్సంపేట పోలీసులు హైదరాబాద్ తరలించారు. పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వైఎస్ఆర్‌టీపీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

టీఆర్ఎస్ కార్యకర్తలు ఆటంకం సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం షర్మిల పాదయాత్రకు అనుమతిస్తూ షరతులు విధించింది. సీఎం కేసీఆర్‌పై రాజకీయ, మతపరమైన అంశాలను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడవద్దని ఆదేశించింది. తాజాగా పాదయాత్రకు దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. పాదయాత్రకు అనుమతివ్వాలని పోలీసులను ఆదేశించింది.

గురజాడా! వారేమి చేస్తున్నారో వారికే తెలియదు... క్షమించు!

విశాలాంధ్ర-విజయవాడ: ఇంగ్లీషు నాటకకర్త షేక్స్పియర్ సాహిత్యంపై ఇప్పటివరకు వచ్చిన, వస్తున్న విమర్శనాత్మక, విశ్లేషణాత్మక పరామర్శలు అనంతమని 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే మన తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు సాహిత్యంపై వెలువడిన పరిశీలనలు, విశ్లేషణలకు కొదువలేదని అన్నారు. పరిశీలనలోగానీ, పరిశోధనలలోగానీ ఎవరూ గురజాడ ఆధ్యాత్మికత గురించి రాసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఎవరైనా రాసివుంటే... వాటికి ప్రామాణికత, గుర్తింపు లేదన్నారు. కానీ, అకస్మాత్తుగా విజయనగరంలోని 'గురజాడ సమాఖ్య'లో కొందరికి మాత్రం గురజాడలో ఆధ్యాత్మికత (అంటే భగవద్గీత, తులసికోట మొదలగునవి) కనబడి, ఈ ఏడాది గురజాడ 107 వ వర్థంతి సందర్భంగా వారు ఏటా ఇచ్చే అవార్డు 'ఆధ్యాత్మిక ప్రవచనకారు' నికి ఇవ్వాలని నిర్ణయించడం ఒక విషాదకరమైన, అసహ్యకరమైన సన్నివేశం అని అన్నారు. ప్రగతిశీలులందరూ దీనిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మన స్పందనలను వివిధ పద్ధతుల్లో తెలియజేయాలని కొత్తపల్లి పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యూసుఫ్, బాలరాజు

విశాలాంధ్ర-యాదగిరిగుట్ట: ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ బాలరాజ్ ఎన్నికయ్యారు. 131 మందితో నూతన సమితి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇక్కడి రెడ్డి సత్రంలోని అమరజీవి గురుదాస్‌దాస్ గుప్తా ప్రాంగణంలోని అమరజీవి నరసింహన్ హాల్లో గత రెండు రోజులుగా జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర మూడో మహాసభలు మంగళవారం ఉతాహ పూరిత వాతవరణంలో ముగిశాయి. మహాసభ రాష్ట్ర కౌన్సిల్, కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా వి.సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శిగా ఎం. నర్సింహ్మాలు ఎన్నికయ్యారు. వీరితో పాటు 39 మంది కార్యవర్గసభ్యులు, 21 మంది ఆఫీసు బేరర్లు ఎన్నికయ్యారు.

తెలంగాణకు బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ఎం.ఎం. సుందరేశ్ల ధర్మా సనం తీర్పులో అభిప్రాయపడింది. వాస్తవాలు, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే... కేసు దర్యాప్తు అక్కడ కొనసాగడం సముచితం కాదని భావిస్తూ కడప సీబీఐ కోర్టు నుంచి హైదరాబాద్ సీబీఐ కోర్టుకు బదిలీ చేయడమే మంచిదని తీర్పులో స్పష్టం చేసింది.

పెద్దస్థాయిలో కుట్ర జరిగింది

వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు పెద్దస్థాయిలో కుట్ర జరిగిందని, ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు ధ్వంసం చేశారని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొంది. న్యాయం జరిగిందని బాధితులు తెలుసుకునే తరహాలో ఉండాలి... కానీ ఇక్కడ అది కనిపించడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మరణించిన వ్యక్తి కుమార్తె, భార్యకు న్యాయం జరగాలని కోరే హక్కు ఉందనీ, ప్రస్తుతం ఉన్న చోట న్యాయమైన విచారణ జరగకపోవచ్చనే అనుమానాలు ఉన్నాయని, తదుపరి దర్యాప్తు స్వతంత్రంగా జరగాలి అంటే కేసును మరోచోటకు బదిలీ చేయాలని కోరడం సముచితం అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. బాధితురాలిగా నేర విచారణ న్యాయమైన పద్ధతి లో జరగాలని కోరడం వారి ప్రాథమిక హక్కుగా ధర్మాసనం పేర్కొంది. విచారణ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా లేకపోతే న్యాయ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పోతుందన్న జస్టిస్ ఎంఆర్ షా... అందుకు అనుగుణంగా విచారణ జరగాల్సి ఉందన్నారు. దర్యాప్తులో భాగంగా పెద్దసంఖ్యలో సాక్షులను విచారించి, ఆ సాక్షులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉంటుందనే ఉద్దేశం తోనే హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేస్తున్నట్లు చెప్పారు. కేసుకు సంబంధించిన అన్ని పత్రాలు, చార్జిషీట్, అనుబంధ చార్జిషీట్లు అన్ని హైదరాబాద్ సీబీఐ కోర్టుకు బదిలీ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. భారీ కుట్ర, సాక్ష్యాధారాల ధ్వంసంపై తదుపరి దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని సీబీఐకి నిర్ధేశించింది. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని తీర్పు ఇచ్చింది.

టీచర్లకు ఉపశమనం

(మొదటిపేజీ తరువాయి)

పొందుపరచకలేక నానా ఇబ్బందులకు గురవుతూ...ఉపాధ్యాయులు క్రమేపీ సమర్థవంతంగా విద్యను అందించలేక పోతున్నారని, ఈ పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తొలగించడానికి చేసిన కుట్రగా అనుమానం వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాలు, సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయాలు, మండల విద్యావనరుల కేంద్రాలు, మండల విద్యాధికారి కార్యాలయాలలో వేలసంఖ్యలో ఉపాధ్యాయులు బోధనేతర పనుల కోసం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారని, అలాంటి వారందర్నీ తక్షణమే రిలీవ్ చేసి, కేవలం విద్యాబోధనకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర్వులు విడుదల చేసినంత మాత్రాన ప్రయోజనం లేదని, ఇచ్చిన దానిని క్షేత్రస్థాయిలో వంద శాతం అమలు చేసినప్పుడే అర్థం ఉంటుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను మూడేళ్లుగా విడుదల చేయకుండా ప్రభుత్వం మానసికంగా వేధింపులకు గురిచేస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులలో ఉన్న వ్యతిరేకతను ఎదుర్కోవడం చేతకాకే ప్రభుత్వం ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తప్పించడానికి కుట్ర చేస్తోందని పేర్కొన్నారు.

ఇప్పటికీ అమరావతే రాజధాని: సజ్జల

- సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం
- వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నాం
- జనవరి 31 వాయిదా తర్వాత మార్పులకనుగుణంగా నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని నగరాన్ని, ఆ ప్రాంతాన్ని ఆరు నెలల్లో నిర్మించి అభివృద్ధి చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేయడాన్ని స్వాగతిస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. వెలగపూడి సచివాలయం మీడియా పాయింట్ వద్ద మంగళ వారం ఆయన మాట్లాడారు. న్యాయ ప్రక్రియకు, రాజ్యాంగ పరమైన చట్టాలకు లోబడి వికేంద్రీకరణ చేయబోతున్నామని స్పష్టంచేశారు. అదే సమయంలో అమరావతి రైతులకూ న్యాయం చేస్తామని, ప్రభుత్వ పెట్టుబడులకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రభుత్వ నిర్వహణలో హైకోర్టు జోక్యం చేసుకుందనే సుప్రీం భావించిందని చెప్పారు. రాజధానిని ఇన్ని రోజుల్లోనే నిర్మించాలని హైకోర్టు టైం లిమిట్ పెట్టడం రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వానికి సంక్రమించే హక్కుల్లో న్యాయస్థానాల జోక్యాన్ని సుప్రీం కోర్టు తప్పుబట్టిందని చెప్పారు. రాజధానికి భూములిచ్చిన రైతు లకు న్యాయం, ఈ ప్రాంత అభివృద్ధి అనేది ప్రభుత్వ బాధ్యతగా తాము చెప్పిన దానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో అన్నిప్రాంతాలకు మధ్యలో ఉన్నందున ఇక్కడ శాసన రాజధాని ఉంటుందని వివరిం చారు. ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమనీ, వారి ఆకాంక్షలకు తగినట్లుగా వ్యవహరిస్తుందనీ, ఇందులో ఎలాంటి సందేహాలు ఉండనక్కర్లేదన్నారు.

రైతుల నుంచి భూములు తీసుకోవడంలో ఆరోజు టీడీపీ నేతలు, అప్పటి ప్రభుత్వం బలప్రయోగాలు చేసిన సంగతి అందరికీ తెలిసిందేనని సజ్జల గుర్తుచేశారు. రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు కంటే మిన్నగా జగన్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సుప్రీం కోర్టు అడిగిన సందర్భంలో... ఈరోజుకూ రాజధాని అమరావతేనని ప్రభుత్వం సమాధానమిచ్చిందని చెప్పారు. రేపటికి ఏం చేస్తామనేదీ తమ ప్రభుత్వం ఒక స్పష్టతతో ఉందని, ఎవరికీ నష్టం జరగకుండా మరింత పకడ్బంధీగా చట్టాన్ని తెస్తామన్నారు. హైకోర్టులో కేసు విచారణ అడ్డంకి రాకపోతే, బడ్జెట్‌లో ఇప్పటికే మూడు రాజధానుల బిల్లు పెట్టేవాళ్లమని, జనవరి 31 వాయిదా తర్వాత జరిగే మార్పులకనుగుణంగా నడుచుకుంటామని సజ్జల చెప్పారు. వివేకా హత్య కేసు విచారణను వేరే చోటికి మారిస్తే మాకూ మంచిదేనని, దీనిపై చంద్రబాబు రాద్ధాంతం తగదన్నారు. షర్మిలమ్మ అరెస్టు విషయంలో వ్యక్తిగతంగా బాధ ఉందన్నారు.

రైల్వే పెండింగ్ పనులు పూర్తి చేయండి

జీఎం జైన్‌కు సీపీఐ ప్రతినిధి బృందం విజ్ఞప్తి

విశాలాంధ్ర-యర్రగుంట్ల: కడప-బెంగళూరు రైల్వే పనులకు నిధులు కేటాయించి... సత్వరమే పనులు పూర్తి చేయాలని, జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ డిమాండ్ చేసింది. వైఆర్ఎస్ కడప జిల్లాలోని రైల్వే సమస్యలపై సీపీఐ ప్రతినిధి బృందం మంగళవారం ఎర్రగుంట్లలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, బి.చంద్రశేఖర్, పి.సుబ్బరాయుడు, వి.గంగా సురేశ్ జీఎంను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఒంటిమిట్ట, కమలాపురం, ముద్దనూరు, కొండాపురం రైల్వే స్టేషన్లలో అన్ని రైళ్లను ఆపడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కమలాపురంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. కమలాపురంలో రైల్వే లైన్ పట్టణానికి మధ్యలో ఉన్నందున ప్రభుత్వ వైద్యశాల, కోర్టు, పోలీసుస్టేషన్, సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. 108, ఫైర్ వాహనాలు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందన్నారు. ప్రత్యామ్నాయంగా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉన్నందున వెంకటాద్రి, రాయలసీమ, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ స్టేషన్‌లో తప్పనిసరిగా ఆపాలన్నారు.. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులు పెండ్లిమర్రి వద్దనే ఆగిపోయాయని, ఈ పనులకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కడప నుండి పెండ్లిమర్రి వరకు గతంలో నడుస్తున్న నంద్యాల-పెండ్లిమర్రి డెమో రైలును కొనసాగించాలన్నారు. తిరుపతి నుండి గుంటూరు వరకు ఎర్రగుంట్ల మీదుగా నడుస్తున్న రైలును విజయవాడ వరకు కొనసాగిస్తూ అక్కడ 8 గంటలకు బయలుదేరే విధంగా చూడాలన్నారు. భాకరాపేట, గిద్దలూరు రైల్వేలైన్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం టౌన్: సత్యసాయి జిల్లా ధర్మవరంలోని కొత్తపేటలో మంగళవారం తెల్లవారుజామున చేనేత కార్మికుడు చింతా జగదీష్ (23) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు, తండ్రి చింతా శ్రీనివాసులుకు చేదోడు వాదోడుగా మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కరోనా సమయములో కుటుంబ అవసరాలు, ముడి పట్టుకు రూ.5 లక్షలు అప్పు చేశాడు. చీరలకు గిట్టు బాటు ధరలు రాకపోవడం, ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగ డంతో అప్పు ఎలా తీర్చాలా అని మనోవేదనకు గురయ్యేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడం, కష్టాలకు తోడు ఆర్థిక సమస్యలతో సతమతమౌతూ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరాతీశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్‌ఔట్ అలవెన్సులు చెల్లించండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు మూడు నెలలుగా చెల్లించాల్సిన నైట్‌ఔట్/డేఔట్ అలవెన్సులను, అనారోగ్యానికి గురైన వారికి వేతనాలను సక్రమంగా చెల్లించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎండీ ద్వారకా తిరుమలరావుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీరావు, పలిశెట్టి దామోదరరావు మంగళవారం లేఖ రాశారు. ఉద్యోగులు అనారోగ్యానికి గురైనప్పుడు వారి వేతనాల్లో కోత విధిస్తున్నారన్నారనీ, దాంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అలవెన్సులు ప్రతినెలా జీతంతోపాటు చెల్లిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూసిన ఉద్యోగులకు కనీసం డిసెంబర్ 1న అందుకునే జీతంలో కూడా కలపడం లేదన్నారు. వేతనంతోపాటు ట్రాఫిక్ గ్యారేజ్ సిబ్బందికి అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు. ఆర్టీసీలో దాదాపు 30శాతం షెడ్యూళ్లు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలో ఓవర్ టైమ్ విధులు నిర్వహిస్తున్న వారికి ఓటీలు చెల్లించాలన్నారు. ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులను పోగొట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించాలి

బాపట్ల జగనన్న కాలనీ పర్యటనలో జల్లి విల్సన్

విశాలాంధ్రబ్యూరో-బాపట్ల: జగనన్న కాలనీల్లో ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించాలని, లేకుంటే నిర్మాణ వ్యయం కింద లబ్ధిదారుడికి రూ.5 లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణం ప్యాడిసన్‌పేట జగనన్న లేఅవుట్‌ను సీపీఐ నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం జల్లి విల్సన్ మీడియాతో మాట్లాడుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు 'దున్నే వాడికి భూమి, నివసించే వారికి ఇళ్లు' నినాదంతో 70 ఏళ్లుగా పోరాటాలు చేశాయన్నారు. వీటి ఫలితంగా ప్రభుత్వాల్లో కదలిక వచ్చి పేదలకు పొలాలు, స్థలాలు ఇస్తున్నాయన్నారు. గతంలో 5సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చిన ప్రభుత్వాలు...రాను రాను 3 సెంట్లు...నేడు వైసీపీ ప్రభుత్వం సెంటు న్నర స్థలం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ పేరుతో ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. వీటిలో ప్రధానంగా రాష్ట్రంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు, ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామనే వాగ్దానం పక్కాగా అమలు చేయాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ఇంటి స్థలమిచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే పక్కా ఇల్లు నిర్మించాలని కోరారు. బాపట్ల నియోజకవర్గంలో 8299 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్ష, రాష్ట్ర ప్రభుత్వం రూ.,30 వేలు మాత్రమే ఇస్తున్నాయని, వీటితో ఇల్లు పూర్తికావడం సాధ్యం కాదన్నారు. సిమెంట్, ఇనుము, ఇసుక ధరలు విపరీతంగా పెరగటంతో లబ్ధిదారులపై అదనపు భారం పడుతోందన్నారు. జగనన్న లేవుట్‌లో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు సదుపాయాలు కల్పించా లన్నారు. జగనన్న లేఅవుట్‌లో రోడ్డు నిర్మాణం లేకపోవటం వలన నిర్మాణ సామగ్రి తెచ్చుకోవడం కష్టంగా మారిందన్నారు. ఇళ్ల నిర్మాణాల కన్నా ముందే జగనన్న లేఅవుట్‌లలో మౌలిక సదుపా యాలు కల్పించాలని సూచించారు. లబ్ధిదారులతో కలిసి డిసెంబర్ 5వ తేదీన సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు జగనన్న కాలనీలు పరిశీలి స్తాయని, తహసీల్దారు కార్యాల యాల్లో వినతిపత్రాలు అందజేస్తాయని వివరిం చారు. పేదవాడి సొంతింటి కల నెరవేరాలంటే ప్రభుత్వమే బాధ్యతగా ఇంటి నిర్మాణం చేపట్టాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల పర్యటనలో సీపీఐ జిల్లా నాయకులు తన్నీరు సింగరకొండ, బత్తుల శామ్యూ ల్, జేబీ శ్రీధర్, షేక్ కరిముల్లా, నియోజకవర్గ నాయకులు మేడా వెంకట్రావు, దుండి కనకారెడ్డి, సైకం రాజశేఖర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-ఉయ్యూరు: పూర్తయిన ఇళ్లను తక్షణమే టిడ్కో లబ్ధి దారులకు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంటలో టిడ్కో గృహాల వద్ద సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం అధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. టిడ్కో ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలని జగన్ ప్రభుత్వాన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి టి.తాతయ్య మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడ్డారని, ఈ అవకతవకల వెనుక అధికారుల పాత్ర ఉందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా మరో సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ మాట్లాడుతూ వడ్డీలకు తీసుకొచ్చి టిడ్కో గృహాల కోసం కడితే సగం కూడా నిర్మాణాలు పూర్తికాలేదని, ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దడాని సంగీతరావు, సీపీఐ బందరు కార్యదర్శి లింగం ఫిలిప్, పెనమలూరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎం.నరసింహారావు, నేతలు మిక్కిలినేని రాధాకృష్ణ, బాలస్వామి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై

జాతీయ మహాసభల్లో చర్చ : రావులపల్లి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేరళ రాష్ట్రంలోని అలపూజ (అలెప్పి)లో డిసెంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మంగళ వారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ రంగాలకు చెందిన కార్మిక సంఘాల పతినిధులు పాల్గొంటారని తెలిపారు. కనీస వేతనాలు, పని భద్రత, పని ప్రదేశాలలో రక్షణ, సామాజిక భద్రతలాంటి హక్కులన్నింటినీ మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. ఈ విధానాలపై పోరాటానికి అవసరమైన కార్యచరణకు ఈ మహాసభలో రూప కల్పన చేస్తామని తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పట్టించుకోని పాలకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ విమర్శ
- రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర - ఏలూరు: డిసెంబరు 7,8,9 తేదీలలో ఒంగోలులో జరగనున్న ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర 5వ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ నిలుపు నిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేగా ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం కాపాడటంలో మున్సిపల్ కార్మికులు ప్రధాన పాత్ర వహిస్తున్నారని తెలిపారు. 103 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయసి , ఎన్నో పోరాటాల ద్వారా కార్మికుల సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేకూర్చిందని చెప్పారు. పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని ఏడో సవరణ కమిషన్ నివేదిక ఇచ్చినా అమలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోం దన్నారు. రెగ్యులర్ కార్మికులకు నేటికీ జీపీఎఫ్ ఖాతాలు ప్రారంభించలేదన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 కార్పొరేషన్లు, 78 మున్సిపాలిటీలు, 31 నగర పంచాయతీలు ఉన్నాయని వీటిలో 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా విధి నిర్వహణ చేస్తున్నా పనిముట్లు అందజేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. యూనిఫాం, చెప్పులు, బట్టలు, కుట్టుకూలీ ఇవ్వకుండా పారిశుధ్య కార్మికుల పట్ల చిన్నచూపు వహిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేటి బేబి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె. కృష్ణమాచార్యులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు తొర్లపాటి బాబు, చాట్ల పుల్లారావు, కె. విగ్నేష్, ఐ నాగరాజు, అప్పారావు, బళ్ల కనక దుర్గారావు పాల్గొన్నారు.

సొంత స్థలాల్లో గృహ నిర్మాణానికి అనుమతి

'ప్రగతి'పై మంత్రి జోగి సమీక్ష

విశాలాంధ్ర-అనకాపల్లి: అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యుడీఏ) ప్రాంతంలో సొంత స్థలం కలిగి ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి అనుమతి స్తామని గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణాల ప్రగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 21.30 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతున్నదని తెలిపారు. దేశంలో మంజూరు చేసిన ఇళ్లలో 20 శాతం ఆంధ్రప్రదేశ్ కు వచ్చాయని చెప్పారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఉత్తరాంధ్ర ముఖద్వారమైన అనకాపల్లి జిల్లా అభివృద్ధిలో ముందుండాలన్నారు. సీఎం జగన్ అందరికీ ఇళ్లు సమకూర్చే యజ్ఞం విజయ వంతానికి అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. రాబోయే ఏడు నెలల్లో గృహ నిర్మాణాలు జెట్ స్పీడ్‌తో జరగాలన్నారు. నిధుల కొరత లేదని, వెంటనే బిల్లుల చెల్లించడం జరుగుతున్నదని చెప్పారు. ముత్యాల నాయుడు మాట్లా డుతూ, పేదవారికి శాశ్వతమైన ఆస్తి కల్పించే ఇళ్ల పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, శాసనసభ్యులు గొల్ల బాబురావు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య

విశాలాంధ్ర - పత్తికొండ: కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పత్తికొండ, తుగ్గలి, మద్దికేర మండలాల సీపీఐ జనరల్ బాడీ సమావేశం చదువుల రామయ్య భవనంలో మంగళవారం సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథంలు హాజరై మాట్లాడారు. రామచంద్రయ్య మాట్లాడుతూ మోదీ అధికారంలోకి రాకముందు అధికారంలోకి వచ్చిన 100రోజుల లోపే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోగా, సామాన్య మానవులు ఏమి కొనలేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచేశారన్నారు. రాష్ట్రానికి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఏపీకి జరిగిన అన్యాయంపై మోదీని నిలదీయడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఆయన ముందు మోకరిల్లుతున్నారని రామచంద్రయ్య విమర్శించారు. గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సరైన వర్షాలు కురవక, అక్టోబర్ నెలలో అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ జిల్లాలో డిసెంబర్ 16 నుంచి 20తేదీ వరకు సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి రైతు రక్షణ పాదయాత్ర నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.భీమలింగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, పత్తికొండ, తుగ్గలి మండలాల కార్యదర్శులు డి.రాజా సాహెబ్, సుల్తాన్, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, తిమ్మయ్య, కారన్న, పెద్ద ఈరన్న, కృష్ణయ్య, కారుమంచి, రంగన్న, గుండు భాష, ఎంకె సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పేదలపై భారాలతో తాయిలాలా?

ఆవుల శేఖర్ విమర్శ

విశాలాంధ్ర-రామభద్రపురం: ఓ వైపు ప్రజలపై భారాలు మోపుతూ...మరోవైపు కొద్దిమందికి తాయిలాలు పంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ విమర్శించారు. విజయనగరం జిల్లా కాకర్లవలస గ్రామంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అధ్యక్షతన వ్యవసాయ సమస్యలపై మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదని ఆవుల శేఖర్ విమర్శించారు. ప్రజలపై డీజిల్, పెట్రోలు, గ్యాస్, పప్పులు, ఉప్పులు, నూనె, ఇసుక, మద్యం, ఇనుము, సిమెంటు, బస్సు చార్జీలు, కరెంట్ చార్జీలతో ప్రజలపై విపరీత భారం మోపాయని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు స్వేచ్ఛ జీవితాన్ని అనుభవించడం లేదని, దుర్భర జీవితం అనుభవిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రైతులను ఏ ప్రభుత్వము పట్టించుకోవడం లేదన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేసి ఉంటే పేదలకు న్యాయం జరిగేదన్నారు. పోడు భూములు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న దళిత, గిరిజనులపై ప్రభుత్వాలు కొరడా ఝుళిపిస్తున్నాయని ఆరోపించారు. ఆ భూములను ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, పెత్తందారులకు కట్టబెడుతున్నాయని చెప్పారు. రైతుల పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు మాట్లాడుతూ పోరాటాలతోనే ప్రజలకు భూ హక్కులు సాధించుకుంటున్నామని, ప్రభుత్వాలు మాత్రం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదలకు భూములు పంచడం లేదని తెలిపారు. రీ సర్వే పేరుతో వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వడం దారుణమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో ప్రభుత్వాన్ని, పోలీసులను, పెత్తందారులను ఎదుర్కొని 5 వేల ఎకరాలు నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐదేనన్నారు. ఆనందరావు మాట్లాడుతూ సాలూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి టి.నాగరాజు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సీపీఐ మన్యం జిల్లా కార్యదర్శి టి.మన్మధరావు, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు లెంక లక్ష్మి, సామిరెడ్డి అప్పలనాయుడు, అలమండ మారేసు, అబ్రహం, 150 మంది రైతులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. విజయవాడ హనుమాన్ పేటలోని దాసరిభవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అభ్యర్థుల వయోపరిమితి 27 ఏళ్లలోపు ఉండాలని ప్రభుత్వం ప్రకటించడం దారుణమని , వయోపరిమితి 35 ఏళ్లకు పెంచాలని కోరారు. గత ప్రభుత్వం 2018లో విడుదల చేసిన ప్రకటనలో అభ్యర్థుల వయోపరిమితి 27 ఏళ్లుగా నిర్ణయించడం సరికాదన్నారు. నాలుగేళ్లుగా నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వయస్సు పెరిగిపోయి అర్హత కోల్పోయామని వేదనకు గురవుతున్నారని చెప్పారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వయోపరిమితి పెంపుదలకు సీఎం జగన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, లంకే సాయి, అయ్యప్ప, సుధీర్ పాల్గొన్నారు.

ప్రకటన

K.E.S పాలిటెక్నిక్ ఫర్ ఉమెన్, వడ్డేశ్వరం కళాశాలను కో ఎడ్యుకేషన్ కళాశాలగా మార్చుటకు నిర్ణయించటమైనది. అభ్యంతరాలు ఉన్న యెడల 15 రోజులలోగా తెలుపగలరు.

ఇట్లు
యాజమాన్యం
K.E.S Polytechnic
(For Women)
Vaddeswaram,
Tadepalli Mandal,
Guntur District - 522502

సంపాదకీయం

బీజేపీ కోటలో రాహుల్‌కు ఆదరణ

బీజేపీ కోటలో భారత్ జోడో యాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి మంచి ఆదరణ లభించింది. ప్రస్తుతం బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ఉన్న మధ్యప్రదేశ్‌లో రాహుల్ యాత్రకు దక్షిణాది రాష్ట్రాల్లో లభించిన స్పందన కంటే మిక్కిలిగా ప్రజాదరణ లభించింది. రాష్ట్రంలో దీర్ఘకాలంగా బీజేపీ ప్రభుత్వం పరిపాలిస్తోంది. దక్షిణాదిన తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాహుల్ జరిపిన యాత్రలో కర్ణాటకలో మంచి స్పందన కనిపించింది. మధ్యప్రదేశ్‌లో అంతకంటే ఎక్కువగా ఆదరణ లభించడం చెప్పుకోదగిన విశేషం. ఈ నెల 27న రాహుల్ యాత్ర మధ్యప్రదేశ్‌లో ప్రారంభమైంది. ఇండోర్‌లో రాహుల్ యాత్రకు కనిపించినంత స్పందన మరెక్కడా కనిపించలేదని భద్రతా దళానికి చెందిన అధికారి ఒకరు వ్యాఖ్యానించారంటే కాంగ్రెస్ పట్ల సానుకూలత పెరిగిందని భావించవచ్చు. యాత్రకు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో వారిని అదుపుచేయడానికి అదనపు బలగాలను రప్పించవలసి వచ్చిందని సిఆర్‌పీఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. పైగా ఈ ప్రాంతంలో ఎంఎల్‌ఏలు, ఎంపీలంతా బీజేపీకి చెందినవారు కావడం మరింత విశేషం. రాజ్యాంగ నిర్మాత డాక్టరు బిఆర్ అంబేద్కర్ జన్మించిన మహోవ నుంచి రాష్ట్రంలో యాత్రను ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి నమస్కరించి 27 ఉదయమే యాత్రను ప్రారంభించినప్పటికీ రాహుల్ నడిచిన ఇండోర్ వీధుల్లో జనం ఊహించినదానికంటే ఎక్కువగా చేరి స్వాగతం పలికారు. నగర రోడ్లన్నీ ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయని, ఇందులో భాగస్వాములైన ప్రజలు పారిశుద్ధ్య కార్మికులను అభినందించారు. వీధుల్లో హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు కనిపించారని, విద్వేషం ఎక్కడా కనిపించలేదని రాహుల్ వ్యాఖ్యానించి నగర ప్రజల సానుకూలతను పెంచుకొనేందుకు ప్రయత్నించి వ్యూహాత్మక రాజకీయనాయకుడన్న అభిప్రాయాన్ని కలిగించారు. చరిత్రాత్మక రజ్వాడలో జరిగిన సభలో రాహుల్ మాట్లాడుతూ, పార్లమెంటులో రైతుల రుణాలను రద్దు చేయాలని, మూడు రైతుచట్టాలకు వ్యతిరేకంగా పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడేందుకు అనుమతించకుండా మైకులు కట్‌చేసిన వైనాన్ని వివరించి బీజేపీపాలనను తూర్పారబట్టి బీజేపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎక్కడా బీజేపీ నాయకులను తూలనాడటం కనిపించకపోవడం ప్రత్యేకత. యాత్ర ప్రారంభించిన నాటికి, నేటికీ పరిణితగల రాజకీయ నాయకుడిగా ఎదుగు తున్నాడని విశ్లేషకులు భావించడం సబబేనని అనిపిస్తోంది. దక్షిణాదిన తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రజల్లో క్రమశిక్షణ కనిపించిందని, మధ్యప్రదేశ్‌లో జనాన్ని అదుపుచేయలేక అదనంగా సీఆర్‌పీఎఫ్ దళాలను పిలిపించామని 25ఏళ్ల అనుభవంగల అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాహుల్ యాత్ర విజయవంతమైందని భావించేందుకు ఇదొక ఉదాహరణ. దక్షిణాది రాష్ట్రాలలో జరిగిన యాత్రకు పూర్తి భిన్నంగా మధ్యప్రదేశ్‌లో జనం స్పందన కనిపించిందని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

రాహుల్ యాత్రను ప్రారంభించిన నాటి నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు పెద్దగా పట్టించుకోలేదు. అత్యధిక ప్రింట్ మీడియా టెలివిజన్ ఛానల్స్ బడా కార్పొరేట్లు, బీజేపీ నేత, ప్రధానమంత్రి మోదీ కనుసన్నల్లో పనిచేయడమే ఇందుకు కారణంగా భావించారు. కొన్ని ఛానల్స్ మోదీ ప్రభుత్వ ప్రాతినిధ్యం వహించినట్టుగా 24 గంటలూ పనిచేయడం ఎంత మాత్రం ప్రజానుకూలంగా ఉండవలసిన ధర్మాన్ని పాటించడంలేదు. పైగా జర్నలిస్టులపైన అకారణంగా కేసులు నమోదుచేసి జైళ్లలో పెట్టి హింసించడం కూడా రాహుల్ యాత్రను పెద్దగా పట్టించుకోకపోవడానికి కారణమై ఉండవచ్చు. మీడియా సైతం మాఫియా చేతుల్లోకి వెళ్లడం నేటి విషాదం. ఖర్గోనె జిల్లాలో యాత్ర సాగుతుండగా పాకిస్తాన్ అనుకూల నినాదాలిస్తున్న మార్ఫింగ్ వీడియోను ప్రసారం చేశారని, ఇది బీజేపీ కుట్రపూరిత ఎత్తుగడఅని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ వ్యాఖ్యానించినప్పటికీ, బీజేపీ స్పందించకపోవడం విచిత్రం. ఈ విషయంపై దర్యాప్తు జరిపించాలన్న జైరామ్ రమేష్ డిమాండుకు ఆ రాష్ట్ర, కేంద్ర బీజేపీ నాయకులు స్పందించలేదు. బీజేపీ సొంత ప్రచార యాంత్రాంగం ఇలాంటివి సృష్టించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే వీటిని బీజేపీ నేతలు, ప్రచార యంత్రాంగం ఏనాడు అంగీకరించదు. పరిపాలనలో చేసిన తప్పిదాలు వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నా, ప్రజలు అనుభవిస్తున్నా మోదీ ప్రభుత్వం అంగీకరించదు.

రాహుల్ యాత్ర విజయవంతంగా సాగుతున్న నేపథ్యంలో బీజేపీ నేతల్లో గుబులు పుట్టిస్తున్నదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కోవిడ్-19 మహమ్మారి విజృంభించగా వ్యాధిని అదుపుచేసి ప్రజల ప్రాణాలు రక్షించడంలో చౌహాన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. 2023లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో రాహుల్ యాత్ర విజయవంతం కావడం సహజంగా ఆందోళన కలిగించేదే. డిసెంబరు1న, 5న, రెండు దశల్లో గుజరాత్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు సందేహాస్పదమేనన్న వార్తలు వస్తున్నాయి. పెట్రోలు, డీజిల్ రేట్లు, నిత్యావసర వస్తువులు రేట్ల పెరుగుదల, గతంలో ఏనాడులేనంతగా నిరుద్యోగం పెరగడంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ఈ సమస్యలన్నీ మధ్యప్రదేశ్ లోనూ ఉన్నాయి. అయితే కాంగ్రెస్‌లో గ్రూపుల మధ్య ఘర్షణల సంస్కృతి కొనసాగడం, వీటిని పరిష్కరించగల బలమైన నేతలేక పోవడం ఆ పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తోంది. అనేక తప్పిదాల మూలంగా బలహీన పడిన కాంగ్రెస్ పుంజుకొనేందుకు రాహుల్ యాత్ర ఎంతో కొంత సహకరిస్తుందని అంచనాలున్నాయి.

జర్మనీ ప్రజావ్యతిరేక మిలిటరీ బడ్జెట్టు


బుడ్డిగ జమిందార్

ఐదురోజుల క్రితం జర్మనీ పార్లమెంటు ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ఆమోదించి మిలిటరీ రంగానికి పెద్దపీటవేస్తూ ఆరోగ్యం, విద్య, సామాజిక సంక్షేమ రంగాలకు తీవ్రమైన కోతలను విధించింది. వాస్తవానికి ఈ బడ్జెట్ ఆమోదంతో ఈ సంవత్సరం జూన్ నెలలో పార్లమెంటు "సాయుధసేవలకోసం ప్రత్యేక ఆస్తులు" పేరిట చేసిన బిల్లు ప్రాతిపదికన జరిగినదే. 100 బిలియన్ల యూరోలకు మించి ఖర్చు చేసే బిల్లు ఆమోదంతో రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అతి పెద్ద పునరాయుధీకరణకు ఉద్దేశించడమైనది. జర్మనీ ప్రభుత్వం చాలా దూకుడుతో రాబోయే తరాలను దృష్టిలో ఉంచుకొని చేసిన బడ్జెట్టుగా చెబుతూ, యూరపులో తన మిలిటరీ శక్తిని ప్రదర్శించడానికి విపరీతంగా ఖర్చు చేయనుంది. క్రితం సంవత్సరంతో పోలిస్తే 2023 సంవత్సరానికి అదనంగా 8.2 బిలియన్ల యూరోలు (సుమారు 70,000కోట్లు రూపాయలు అదనం) ఖర్చుతో మొత్తం 5860 కోట్ల యూరోలు ఆయుధాలకు వెచ్చించనుంది. దీనితో అనేక ఎఫ్-35 యుద్ధ విమానాలు, సీహెచ్-47 భారీ హెలికాప్టర్లు, యుద్ధనౌకల్ని సమకూర్చుకొని మిలిటరీ శక్తిగా యూరపులో ఎదగటానికి ప్రయత్నాలను ప్రారంభించింది. తొలిదశ ప్రారంభంలో 2024,2025,2026 సంవత్సరాలలో ఏటా 8050 కోట్ల యూరోలు ఖర్చు చేయడానికి ప్రణాళికల్ని సిద్ధం చేసింది.

ఈ దీర్ఘకాలిక పునర్వ్యవస్థీకరణపేరుతో దేశప్రజలపై తీవ్రంగా ఆర్థిక దాడులు ప్రారంభించడానికి ఆయుధాల కంపెనీలతో జర్మనీ చేతులు కలుపుతుంది. విచిత్రమేమంటే రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వ ప్రణాళికల్ని ఆమోదిస్తున్నాయి. ఒకవైపు నాటో జోక్యంతో రష్యాపై ఆంక్షలు విధించని కారణంగా ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోయి కోట్లాది ప్రజలు యూరపులో చలికి వణికిపోయే ప్రమాదం ఉంది. ఒక మెగావాట్ గ్యాసు ధర 35యూరోల నుంచి 185 యూరోలకుపెరిగింది. ద్రవ్యోల్బణంపెరుగుతుంది. పరిశ్రమలు మూతబడు తున్నాయి. ఆర్థిక మాంద్యం దిశగా యూరప్ నడుస్తోంది. 1971లో సంభవించిన పెట్రోలు సంక్షోభంలా నేడు ఇంధన సంక్షోభం తీవ్రతరమవుతున్న దశలో, ప్రపంచదేశాలు శాంతిప్రయత్నాలు మాని, యుద్ధ ఖర్చులకై వెంపర్లాడటం మానవ పురోగతి వెనుకకు తిరిగే తీవ్ర ప్రమాదం పొంచిఉంది. ఇంకా కోట్లాదిమందిని పేదరికం దిశగా ఈ యుద్ధ సంక్షోభాలు నడిపిస్తున్నాయి.

జర్మనీలో 2021 బడ్జెట్ 556.7 బిలియన్లు కాగా ఆర్థిక మాంద్యం దృష్ట్యా ఈ 2023 బడ్జెట్ 496బిలియన్లకు తగ్గించారు. అయినా మిలిటరీ బడ్జెట్టును మాత్రం విపరీతంగా పెంచడం దారుణం. పెంచిన ఈ బడ్జెట్టుకు కావలసిన నిధులు విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమ పథకాల కోతలతో సాధ్యతరం చేస్తున్నారు. క్రితం సంవత్సరం 6436 కోట్ల యూరోలు ఉన్న వైద్యరంగం బడ్జెట్‌ను ఘోరాతిఘోరంగా 2023 నాటికి కేవలం 2448 బిలియన్లు మాత్రమే కేటాయించారు. అంటే 4000 కోట్ల యూరోలు(3,40,000కోట్ల రూపాయలు) తగ్గించారు. విద్యకు కేటాయించిన 2146 కోట్ల యూరోలలో చాలా మొత్తాన్ని యుద్ధ అకాడమీలకు మళ్లించనున్నారు. ప్రపంచంలో నేడు ఏకఛత్రాధిపత్యానికి అమెరికా అధిపత్యానికి కాలం చెల్లుతుందనే విషయం చాలా స్పష్టంగా కనబడుతున్నా దాన్ని ఒప్పుకునే స్థితిలో అమెరికా లేదు. రష్యాపై విజయాన్ని సాధిస్తే, రష్యా చుట్టూ నాటో సేవలు మోహరిస్తే రష్యాను చిన్నాభిన్నం చేయొచ్చనే ఆనందంలో అమెరికా ఉంది. అంతవరకూ రష్యా రానీయదు. ఒకవేళ ఆ స్థితివస్తే అణుయుద్ధానికి దారితీస్తే ప్రపంచదేశాలు సర్వనాశనమైపోతాయి. ఇప్పుడు తక్షణం కావల్సింది యుద్ధాలు. ఆయుధ సరఫరాలు కాదు. తక్షణమే శాంతి చర్చలు ప్రారంభంకావాలి. ప్రజా వ్యతిరేక బడ్జెట్టులు కనుమరుగైపోవాలి. దీనికోసమే ప్రపంచ కార్మికులంతా, కర్షక రైతు కూలీలంతా ఏకమవ్వాలి.

ఈ బాటలో ఇప్పటికే యూరపు కదులుతుంది. ఉక్రెయిన్ యుద్ధంతో జర్మన్ ప్రజలు పూర్తిగా విసుగుచెందుతున్నారనే సంకేతాలు అందు తున్నాయి. అక్టోబరులో జరిగిన ఒక సర్వేలో రష్యాను నాటో రెచ్చగొట్టి యుద్ధబరిలోకి దింపిందని 40శాతం ప్రజలు విశ్వసించారు. ఇది తూర్పు జర్మనీలోనైతే 59శాతం ఉంది. ప్రతివాదులలో మూడింట ఒక వంతు జనం ఉక్రెయిన్ చరిత్రాత్మకంగా రష్యాలో భాగమని అభిప్రాయపడ్డారని అల్‌జజీరా పేర్కొంది. ఉక్రెయిన్ గడ్డపై అమెరికా రహస్య రసాయన ప్రయోగశాలలు ఏర్పాటు చేసిందని అంతేశాతం జనం నమ్ముతున్నారు. రానురాను రష్యా అనుకూలురు పెరుగుతున్నట్లు జర్మనీలోనే గాక, వేరే దేశాల్లో కూడా వెల్లడవుతుందని అల్‌జజీరా పేర్కొంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు పంపించాలని కొన్ని నెలల క్రితం 62శాతం జనం వత్తిడితెస్తే నేడది జర్మనీలో 40 శాతానికి పడిపోయింది.

ఉక్రెయిన్‌కు మద్దతునిస్తున్న ఐరోపా యూనియన్ చర్యలకు నిరసనగా చెక్‌రిపబ్లిక్ ప్రాగ్‌లో లక్షకుపైగా ప్రజలు నిరసన ప్రదర్శన చేశారు. నవంబరు 5న వేలాదిమంది రోమ్ నగరంలో ఈ.యూకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపారు. జర్మనీలో పెరుగుతున్న ధరలకు, ద్రవ్యోల్బణానికి నిరసనగా అనేక పట్టణాల్లో వేలాదిమందితో ప్రదర్శనలు జరిగాయి. ఈయూ ప్రభుత్వాలు రానున్న ఎన్నికల్లో బలమైన సవాళ్లు ఎదుర్కోనున్నాయి. ప్రత్యామ్నాయంగా పటిష్టమైన వామపక్షం లేకున్న చోట్ల ప్రజలు మితవాదులకు పగ్గాలు అప్పగిస్తున్నారు. అ ప్రక్రియలు ఇటలీ, స్వీడన్ దేశాలలో ఇటీవలి ఎన్నికల్లో జరిగాయి.

దేశంలో రెండు న్యాయ వ్యవస్థలు

చెరుకూరి సత్యనారాయణ

స్వాతంత్రోద్యమ కాలంలో సరోజిని నాయుడిని ఆనారోగ్య కారణంగా విడుదల చేసిన విషయం ఆగాఖాన్ ప్యాలెస్‌లో ఆమెను నిర్బంధించిన గదిలోఉన్న బోర్డు తెలియజేస్తుంది. కనీసం వలసపాలకుల నాటి న్యాయం అమృతోత్సవ భారత్‌లో ఆశించలేమా? రాజ్యాంగబద్ధ సామాజిక, రాజకీయ న్యాయాలకు న్యాయవ్యవస్థ కట్టుబడి తన విధుల్ని నిర్వహిస్తే, రాజ్యాంగం 129వ అధికరణ కింద కల్పించిన అసాధారణ అధికారాల్ని ఆయుధంగా సర్వోన్నత న్యాయస్థానం మలచుకుంటే తప్ప సామాన్యుడికి దేశంలో రెండు న్యాయవ్యవస్థలున్నాయనే అభిప్రాయం మారదు.

"చట్టం ఉన్నవాడికి చుట్టం" అనే డైలాగుని ఎన్నో పాత సినిమాల్లోనూ, నాటకాల్లోనూ విని ఉన్నాం. కాలక్రమంలో ధనం ఉన్నవాడికేకాక, అధికారం ఉన్నవాడికి చట్టం దగ్గరైంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కార్యనిర్వాహక న్యాయవ్యవస్థల మధ్య పరస్పర వ్యతిరేక భావనలున్నా ఒక దానిపై మరొకరు స్వారీ చేయాలని కాకుండా గౌరవప్రదమైన సంబంధాలే కొనసాగించారు. ఇందిరాగాంధీ కాలం నుంచి న్యాయవ్యవస్థ తనచెప్పుచేతల్లో ఉండాలని కార్యనిర్వాహక వ్యవస్థ కోరుకుంటుంది. అది ఆనాడు (1975) ముగ్గురు సీనియర్లని కాదని ఎఎన్‌రేని ప్రధాన న్యాయమూర్తిగా నియమించుకునేంత తీవ్రస్థాయికి వెళ్లింది. ఈనాడు అంత అడ్డగోలుగా కనపడకపోయినా, సాంప్రదాయకంగా నియమితులైన న్యాయమూర్తులద్వారా తమకు అనుకూలమైన తీర్పులు వచ్చేట్టుగా పావులు కదులుతున్నాయి. గవర్నర్ పదవిని, రాజ్యసభ సభ్యత్వాన్ని ఆమోదించే తక్కువ స్థాయికి ప్రధాన న్యాయమూర్తుల వ్యక్తిత్వం దిగజారింది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో జరిగిన కొన్ని విషయాల్ని పరిశీలిస్తే దేశంలో రెండు న్యాయ వ్యవస్థలున్నాయా? అనే అనుమానం కలుగుతుంది. ఈ అనుమానానికి ఆస్కారమిచ్చిన కొన్ని ప్రముఖ విషయాల్ని పరిశీలిద్దాం.

బీమా కోరెగావ్ కేసులో నిందితులకు సంవత్సరాల తరబడి కనీసం బెయిల్ రాకపోవడం. జైల్లో దుర్భర పరిస్థితుల్ని తట్టుకోలేక స్టాన్‌స్వామి అనే ముద్దాయి చనిపోవడం, కనీసం మంచినీళ్లు తాగడానికి అవయవాలు సహకరించని కారణంగా సిప్పర్ కావాలనే కనీస కోర్కెను నెరవేర్చకపోవటం మాత్రమే కాక "నన్ను నిర్బంధంలోనే కొనసాగించండి...కాకపోతే నేనున్న తలోజ జైల్లో కాకుండా గృహనిర్బంధంలో ఉంచండి" అని గౌతం నవలఖా అనే ముద్దాయి సుప్రీంకోర్టుని ఆశ్రయిస్తే ఉన్నత న్యాయస్థానం 'దయ'తో ఆ అభ్యర్థన ఆమోదించి కొన్ని అడ్డగోలు షరతులు విధించింది. ఎస్కార్టు కోసం రెండున్నర లక్షలు డిపాజిట్ చేయమని, ఇంటర్‌నెట్ ఉపయోగించకూడదని, అది కనెక్ట్ అయిఉన్న టీవీ కూడా వాడకూడదని, పోలీసులు అందచేసిన ఫోనులోనే రోజుకు 90 నిమిషాలు మాత్రమే మాట్లాడాలని, కుటుంబ సభ్యులను 3గంటలు మాత్రమే కలవాలని, ఆ షరతుల్లో పేర్కొంది. 2018 నుంచి తలోజ జైల్లోఉన్న నవలఖాకు ఇది సుప్రీం కల్పించిన ఊరట.

కేరళకు చెందిన సిద్ధికి కప్పన్ అనే పాత్రికేయుడిది మరో విషాదం. కేరళలోని మలప్పురానికి చెందిన ఆయన ఆ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల ఢిల్లీ శాఖకు కార్యదర్శి. ఢిల్లీలో మళయాళ పత్రికలకు కథనాలు అందిస్తాడు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌లో హత్రాస్ గ్రామంలో ఒక దళిత యువతిపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనపై వార్తాసేకరణకు ఢిల్లీ నుంచి అక్కడకు వెళ్లాడు. ఆమె చనిపోవడం, పోలీసులే హడావుడిగా అంత్యక్రియలు జరిపించడం దేశవ్యాప్తంగా సంచలనం కల్గించాయి. ఆయన్ని, కారుల్లో వున్న మరో ముగ్గుర్ని యూపీ పోలీసులు అరెస్టుచేసి 'ఉపా' చట్టం ప్రయోగించారు. రాజ్యాంగంలోని 19ఏ నిబంధన ప్రకారం ఒక పౌరుడు దేశంలో ఎక్కడికైనా వెళ్లవచ్చు. స్థిరనివాసం ఏర్పరచుకోవచ్చు. కాని యోగి ప్రభుత్వం యూపీలో అడుగుపెట్టడానికి వీసా కావాలంటుందేమో! అన్యాయంగా అక్రమంగా తీవ్రమైన ఉపా చట్టాన్ని ప్రయోగించారు. ఎట్టకేలకు రెండు సంవత్సరాల తర్వాత మొన్న సెప్టెంబరులో కప్పన్‌కి ప్రధాన న్యాయమూర్తి లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం బెయిల్ ప్రసాదించింది. అందులోనూ ఉత్తరప్రదేశ్‌కి చెందిన స్థానికులు ఇద్దరు జామీను దారులుగా ఉండాలని షరతు విధించడం న్యాయమా? కేరళకు చెందిన వ్యక్తికి యూపీలో పరిచయస్తులు ఉండటం ఎలా సాధ్యం? ఒక జామీనుదారుగా ఉండటానికి లక్నో యూనివర్సిటీ మాజీ కులపతి రూప్ రేఖావర్మ ముందు కొచ్చారు. రెండో జామీనుదారుగా నిలవాలని చాలామంది ప్రజాస్వామ్యవాదులకున్నా యోగి ప్రభుత్వాన్ని చూసి భయపడుతున్నారు.

బీమా కోరెగావ్ కేసులో ముద్దాయిగా 73 సంవత్సరాల ఆనంద్ తేల్తుంబ్డేకి బొంబాయి హైకోర్టు బెయిల్ మంజూరుచేసి, ఎన్ఐఏ విజ్ఞప్తితో విడుదలపై స్టే విధించింది. తేల్తుంబ్డే విషయంలో గాని కప్పన్ విషయంలో గాని, నవలఖా విషయంలో గాని దూడకుమేత వేసి మూతికి చిక్కం కట్టడం కాదా! ఈ విషయాలన్నిటికంటే ఘోరం బిల్కిస్ బానో కేసులో యావజ్జీవ శిక్షలుపడిన డజనుకుపైగా ముద్దాయిల్ని "అమృతోత్సవం" పేరిట వదిలివేయడం. ఇది 2002 గుజరాత్ మత మారణకాండ నాటి మాట. తన మూడేళ్లపాపని, తోబుట్టువుల్ని మొత్తం కుటుంబసభ్యుల్ని నరికి చంపి, గర్భవతిగా ఉన్న బిల్కిస్ బానోపై అత్యాచారం జరిపిన ఈ కేసులో ఒక ముద్దాయి తనను వదిలివేసే విషయం పరిశీలించాలని సుప్రీంకోర్టుకు వెళ్లగా నీచమైన ఈ కేసులో అలా వదలడం కుదరదని చెప్పకుండా ఈ విషయం పరిశీలించమని గుజరాత్ ప్రభుత్వానికి సూచించడం దొంగకు తాళాలివ్వడం కాదా! ఈ ముద్దాయిలంతా బీజేపీ క్రియాశీల కార్యకర్తలు. ఇది ప్రభుత్వ నిర్ణయమేకానీ కోర్టు నిర్ణయం కాదని వాదించడం సబబా? వీరిని విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన జీఓలో "ఈ ముద్దాయిలందరూ బ్రాహ్మణులు. మంచి బుద్ధిగల వారు" అని రాయడం చూస్తే మొత్తం వ్యవహారం అర్థం కావడంలేదా! 2019లో ఆమెకు 50లక్షల రూపాయల నష్టపరిహారం ఇమ్మని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని ఒక ప్యూను ఉద్యోగం ఇచ్చి సరిపెట్టిన ప్రభుత్వ దుశ్చర్యని సమీక్షించడం సుప్రీంకోర్టు బాధ్యత కాదా?

ఈ ఘోరం బిల్కిస్‌బానో ముస్లిం అవడం వల్లే జరిగిందని, ఇది హిందూ సంస్కృతి కాదని శివసేన పత్రిక సామ్నా నిరశించడం చూస్తే ఇదెంత ఘోరమైన విషయమో అర్థమవుతుంది. ఆమెకు స్వేచ్ఛగా జీవించే హక్కును తుడిచేస్తూ మనది స్వేచ్ఛాయుత దేశంగా ఎలా చెప్పుకుంటాం అని ఐపిఎస్ అధికారి స్మిత సభర్వాల్ అన్నారు. "నా జీవితాన్ని, నా కుటుంబాన్ని నాశనం చేసి నా చిన్నారి కూతుర్ని కూడా నా నుంచి దూరం చేసిన 11మంది నిందితుల్ని విడుదల చేయడం న్యాయంపైన నాకున్న నమ్మకాన్ని కదిలిపోయేలా చేసింది" అని వాపోయిన ఆ నిర్భాగ్యురాలి శోకం న్యాయవ్యవస్థకు క్షేమమేనా? ఈ నిందితులంతా విడుదలై మేళతాళాలతో ఊరేగింపుగా వస్తుంటే భయభ్రాంతులైన రాంధిక్‌పూర్ (బిల్కిస్ స్వగ్రామం) వాసులు పెట్టేబేడా సర్దుకొని ఊరువిడిచి పోయారు.

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు మరో కొందరు సహనిందితలను (అర్బన్‌నక్సల్స్) యావజ్జీవ కారాగార శిక్షనుంచి విముక్తుల్ని చేస్తూ బొంబాయి హైకోర్టు తీర్పు ఇవ్వగా శెలవుదినం రోజు అత్యవసరమైన కేసుగా దీన్ని విచారించిన సుప్రీంకోర్టు ఆ తీర్పును స్టే చేసింది. సాంకేతిక కారణాలతో కేసును కొట్టివేయడాన్ని వేలెత్తి చూపింది. కస్టడీలో ఉన్న అనేక కరడుగట్టిన నేరస్తులు 90 రోజుల్లో నేరారోపణ పత్రం దాఖలు చేయలేదన్న సాంకేతిక కారణాలతో వేల సంఖ్యలో దేశవ్యాప్తంగా విడుదలవుతుంటే ఉన్నత న్యాయస్థానాలు ఏనాడూ వేలెత్తి చూపలేదు. 90 శాతం శారీరక వైకల్యమున్న ఈ ప్రొఫెసర్ విషయంలో ఇంత "అత్యవసరం" సుప్రీంకు ఏమి కన్పించిందో తెలియదు. మాలెగావ్ పేలుళ్ల కేసులో సాధ్వి ప్రజ్ఞాసింగ్ చక్రాల కుర్చీలో కోర్టులో కనిపిస్తే ఆమె కబడ్డీ ఆడుతున్న ఫొటోలు మీడియాలో కనిపించాయి. కానీ ఆమె శరీరమూ, మెదడూ రెండూ ప్రమాద రహితంగా కన్పించడంతో ఆమె ఎంపీ అయ్యారు. అవసరమైన అనుమతులు రాకుండానే నేరారోపణ, సాక్షుల విచారణ జరగడాన్ని సాంకేతిక కారణంగానే భావించడం చూస్తే అత్యున్నత న్యాయపాలికల పాత్ర ఏమిటి?

స్వాతంత్రోద్యమ కాలంలో సరోజిని నాయుడిని ఆనారోగ్య కారణంగా విడుదల చేసిన విషయం ఆగాఖాన్ ప్యాలెస్‌లో ఆమెను నిర్బంధించిన గదిలోఉన్న బోర్డు తెలియజేస్తుంది. కనీసం వలసపాలకుల నాటి న్యాయం అమృతోత్సవ భారత్‌లో ఆశించలేమా? రాజ్యాంగబద్ధ సామాజిక, రాజకీయ న్యాయాలకు న్యాయవ్యవస్థ కట్టుబడి తన విధుల్ని నిర్వహిస్తే, రాజ్యాంగం 129వ అధికరణ కింద కల్పించిన అసాధారణ అధికారాల్ని ఆయుధంగా సర్వోన్నత న్యాయస్థానం మలచుకుంటే తప్ప సామాన్యుడికి దేశంలో రెండు న్యాయవ్యవస్థలున్నాయనే అభిప్రాయం మారదు.

ఆక్వా సంక్షోభ కారణాలు-కారకులు!

రాష్ట్రంలో ఆక్వా సాగు సంక్షోభం, రొయ్యల రేట్ల పతనం గురించి వాస్తవ కారణాలు వివరించకుండా పాలకులు సమస్యను పక్క దారి పట్టిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాలకు పాకులాడుతున్నాయి. మన రాష్ట్రంలో రొయ్యల సాగు 1980లో ప్రారంభమైంది. అంతకు ముందు గ్రామ చెరువుల్లో చేపల పెంపకం, నాటు పడవలు, చిన్న చిన్న మరబోట్లతో సముద్ర వేట ద్వారా చేపలు, రొయ్యల వేట చేసేవారు. 1970కు ముందు రొయ్యలు, చేపలు దేశీయంగానే ఉపయోగించేవారు. వాటి ధరలు కూడా ప్రజలకు చాలా అందుబాటులో ఉండేవి. సముద్రతీర గ్రామాల ప్రజలు వేట ద్వారా తెచ్చిన చేపలు, రొయ్యలు బంధువులకు, తమ ఇంటి పక్కన ఇండ్ల వారికి ఉచితంగా ఇచ్చేవారు. 1980 తర్వాత వ్యాపార సరళితో అమ్మకం ధర నిర్ణయించం ప్రారంభమైంది. 1990లో సరళీకరణ ఆర్థిక విధానాలు అమలు లోకి రావటంతో రొయ్యల కొనుగోలుకు అంతర్జాతీయ మార్కెట్లు ఏర్పడ్డాయి. ఫలితంగా విదేశాలకు రొయ్యల ఎగుమతి ప్రారంభమైంది. నేడు అత్యధిక శాతం రొయ్యల ఎగుమతి విదేశాలపై ఆధారపడి ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితంగా వ్యవసాయ గిట్టు బాటు కాని పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రొయ్యలకు మంచి రేటు లభించి బోటు యజమానులు ఆర్థికంగా బలపడటం, కొన్ని ప్రాంతాలలో చేపల, రొయ్యల సాగువలన అధిక ఆదాయం రావటంతో 1980లో ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రాంతాలకు రొయ్యల సాగు విస్తరించింది. మరోపక్క బోట్ల వేట ద్వారా వాటి యజమానులకు మిగులు ఎక్కువగా ఉండటంతో వాటి సంఖ్య విపరీతంగా పెరగటం ప్రారంభమైంది. ఉప్పు కయ్యల భూములే కాకుండా పంట భూములు కూడా రొయ్యల చెరువులుగా మారాయి. వేలం వెర్రిలా చెరువుల నిర్మాణం తయారైంది. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ లో 3.9 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఇందులో లక్షా 90 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతుంటే మరో రెండు లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. వీరిలో 2.5 ఎకరాల లోపు రైతులు 95,277 మంది రైతులు ఉంటే, ఆపై ఐదు ఎకరాల లోపు రైతులు 22,338 మంది ఉన్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేసేవారు 11,809, 10 ఎకరాలకు పైగా సాగు చేసేవారు 6,398 మంది ఉన్నారు. ప్రతి సంవత్సరం 18లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తి జరిగి 66 వేల కోట్ల ఆదాయం వస్తున్నది. దేశం నుంచి జరిగే ఆక్వా ఎగుమతుల్లో 40% రాష్ట్రం నుండే జరుగుతున్నది. రొయ్యల సాగు ప్రారంభమైన తొలి, మలి సంవత్సరాల్లో సాగుదారునికి మంచి ఆదాయం వచ్చింది. ఆ తర్వాత సరైన సాగు పద్ధతులు లేక తెగుళ్లు వ్యాపించి కొద్ది మంది రైతులు తప్ప అందరూ తీవ్ర నష్టాల బారిన పడ్డారు. ఉన్న ఆస్తులు అమ్ముకుని అప్పులు తీర్చాల్సి వచ్చింది. ఆక్వా సాగు అనేక పర్యావరణ సమస్యలకు దారి తీసింది. ఉప్పునీటి వలన తాగటానికి ఉపయోగపడే నీరు కూడా ఉప్పుగా మారి చాలా ప్రాంతాల్లో తాగు నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది.

ఇప్పటికీ రాష్ట్రంలో చేపలు, రొయ్యలు ఎక్కువగా సముద్ర వేట ద్వారానే లభిస్తున్నది. మొదట సాంప్రదాయ వేట ప్రధానంగా ఉన్న క్రమంగా మరబోట్లు, ట్రాలర్లు ప్రవేశించటంతో సాంప్రదాయ నాటు పడవల వేట చాలా సముద్ర తీర గ్రామాల్లో కనుమరుగయ్యింది. ట్రాలర్ల ప్రవేశంతో సముద్ర మత్స్య సంపద కూడా తరిగి పోతూ ఉండటం, చిన్న పిల్లలు కూడా ట్రాలర్ల పెద్ద వలల్లో చిక్కి చనిపోవటంతో పునరుత్పత్తి తగ్గిపోయి చిన్న బోట్ల యజమానులు, మత్స్య రంగం తీవ్ర సంక్షోభాలను ఎదొర్కొన వలసి వచ్చింది. భారతదేశం నుంచి ప్రధానంగా చైనా, అమెరికా ఐరోపా దేశాలకు రొయ్యల ఎగుమతి జరుగుతున్నది. రొయ్యల ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఈక్వడార్, ఇండొనేషియాలు మనతో పోటీ పడుతున్నాయి. ఫలితంగా మన దేశ రొయ్యలకు డిమాండ్ తగ్గింది. నాణ్యత లోపించిందనే పేరుతో దేశం నుంచి రొయ్యల ఎగుమతి ఆపివేశాయి. పెద్ద రొయ్యల కంపెనీలు అవసరమైనప్పుడు ధర పెంచటం, ఆ తర్వాత ధరను దారుణంగా తగ్గిస్తున్నాయి. 2022 జనవరిలో 30కౌంట్ రొయ్య కిలో ధర 620రు. ధర పలికింది. ఏప్రియల్ 600



రూపాయల ధర లభిస్తే ఇప్పుడు రు.400, 60 కౌంట్ అప్పుడు 400 ఉంటే ఇప్పుడు 250, 80 కౌంట్ 310 ఉంటే ఇప్పుడు 220 రూపాయల ఉంది. నేడు పెరిగిన రొయ్యల దాణా ధర, కరెంట్ చార్జీల వలన 100 కౌంట్ రొయ్య కిలో ఉత్పత్తి ఖర్చు 270 రూపాయలు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 210. ఇది ఉత్పత్తి ఖర్చు కన్నా 60 రూపాయలు తక్కువ.

ఎకరా రొయ్య సాగుకి కౌలు ఖర్చుతో 80 వేల పైగా పెట్టుబడి అవసరం. 30 కౌంట్ రొయ్య రెండు క్వింటాళ్లు దిగుబడి వచ్చి కిలో నాలుగు వందల ధర ఉంటే రైతుకి ఎటువంటి మిగులు లేకుండా పెట్టుబడి మాత్రమే వస్తుంది. మూడు క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతు మిగులు ఆదాయం పొందుతాడు. ఇంత దిగుబడి చాలా కొద్ది మంది రైతులకే వస్తుంది. వంద కౌంట్ కే రొయ్య పెరుగుదల పరిమితమైతే పెట్టుబడి కూడా రాదు. తెగుళ్లు వ్యాపించి రొయ్యలు చనిపోవటం ప్రారంభిస్తే పెరుగుదల లేకుండానే ఉన్న రొయ్యలను పట్టి అమ్మటం వలన రైతు తీవ్రంగా నష్ట పోతున్నాడు. ప్రస్తుతం అధిక వర్షాల వలన ఆక్సిజన్ లో మార్పు వచ్చి చెరువులలో రొయ్యలు చనిపోవటాన్ని అవకాశంగా తీసుకుని కంపెనీలు పెద్ద మొత్తంలో ధర తగ్గించారు. ధర తగ్గటమనేది వ్యాపారుల, కంపెనీల సృష్టే. అదుపు లేకుండా విస్తరిస్తున్న ఆక్వా సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేసి చిన్న, సన్న కారు రైతులకు దాణాపై 50% సబ్సిడీ ఇచ్చి, యూనిట్ కరెంట్ రూపాయికి ఇచ్చి, సాగు ఖర్చుకు అవసరమయ్యే పెట్టుబడిని పావలా వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ఆదుకోవాలి. సామ్రాజ్యవాదుల, ప్రపంచ బ్యాంకు సూచనల మేరకే దేశంలో చేపల, రొయ్యల సాగు విస్తరణ జరుగుతున్నది. ఎగుమతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు చేయాలని ప్రపంచ బ్యాంక్ సూచనలకు అనుగుణంగా ఆక్వా సాగును కేంద్రం ప్రోత్సహిస్తున్నది.

బలవంతమైన ఆహారాన్ని దేశ ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అందుకు విరుద్ధంగా కేంద్ర పాలకులు అనుసరిస్తున్నారు. దేశ ప్రజలకు అవసరమైన మేరకు ఆక్వా సాగు పరిమితమై దేశంలోనే విక్రయాలు జరిగేలా చేస్తే ప్రజలకు చేపలు, రొయ్యల ధరలు అందుబాటులోకి రావటమే కాకుండా, సేద్యం సంక్షోభం నుంచి బయట పడుతుంది. రైతాంగం నష్టపోయే పరిస్థితి ఉండదు.

బొల్లిముంత సాంబశివరావు

వలస కార్మికులపై నిర్లక్ష్యం

పట్టించుకోని రాజకీయ పార్టీలు...నేతలు

ఏళ్ల తరబడి మరమగ్గ కార్మికుల జీవితాలు దుర్భరం

సూరత్: గుజరాత్‌లోని సూరత్‌లో మరమగ్గాల కార్మికులు అధికం. వలస కార్మికులు పెద్దసంఖ్యలో ఉంటారు. అయినప్పటికీ వారు రాజకీయంగా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. వారికి లభించే ఆదాయం సైతం అంతంత మాత్రమే. మిగిలిన కొద్దో గొప్పో ఆదాయాన్ని సొంతిళ్లకు పంపుతారు. మొత్తంమీద సూరత్‌లో వలస కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయి. ఏళ్లతరబడి మరమగ్గాల నగరంగా సూరత్‌కు మంచి గుర్తింపు ఉండటంతో 15 ఏళ్ల వయసులో సీమాంచల్ సాహు సూరత్ వచ్చాడు. అప్పటికే సూరత్‌లో ఆయన బంధుగణం ఉంది. ఇప్పుడు సాహు వయసు 35 ఏళ్లు. సూరత్‌లోని వేద రోడ్డులో ఆయన జీవిస్తుంటాడు. కొన్నేళ్లుగా ఆయన మరమగ్గాలు నడపటంపై తనకు తాను శిక్షణ తీసుకున్నాడు. రోజుకు 12 గంటలు పనిచేస్తాడు. వారాంతపు సెలవులు సైతం లేవు. అయితే, దీపావళి పండుగ సమయంలో ఆయన ఫ్యాక్టరీకి సంబంధించిన దుకాణాలన్నీ నెలరోజులు మూసివేస్తాడు. ఆ సమయంలో తాము బరంపురం వెళతామని సాహు చెప్పాడు. 2002లో ఒడిశా నుంచి ఆయన సూరత్‌కు వలస వచ్చాడు. 'ఇళ్లు వదిలి పనికోసం సూరత్ రావడం తప్పనిసరి. ఇది అవకాశం ఏమాత్రం కాదు. మా గ్రామంలో ఉన్న ప్రతి అబ్బాయి చిన్న వయసులోనే చాలినంత పనికోసం సూరత్ వస్తాడు' అని సాహు చెప్పారు. తమ కుటుంబాలకు అండగా నిలిచేందుకుగాను తమ గ్రామంలోని కనీసం ఒక బాలుడు పని వెతుక్కుంటూ సూరత్ వస్తాడని సాహు తెలిపాడు. 'ఎకరం లోపు గల తమ పొలంలో మా సోదరుల్లో ఒకడు వ్యవసాయం చేస్తాడు. మరో సోదరుడు రోజువారీ కార్మికుడు. నేను సూరత్ వచ్చాను. ఇలాగే ప్రతికుటుంబంలోనూ తమ పనులను విభజించుకుంటుంది' అని ఆయన వివరించాడు. మరమగ్గాలకు సంబంధించిన చిట్కాలు నేర్చుకుంటున్న తొలినాళ్లలో ఓ ప్రమాదంలో తాను కన్ను కోల్పోయాను. అయినా తాను సూరత్‌లోనే ఉన్నాను. తిరిగి వెళ్లడం అనేది కుదిరేపనికాదని సాహు వివరించాడు. ఇప్పుడు సాహు అన్ని మార్గాల ద్వారా నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు సంపాదిస్తున్నాడు. ఇది కూడా రోజుకువె ఎంత బట్ట నేయగలుగుతున్నాననే దానిపై ఆధారపడి ఉంది. ఇంత బట్టకు ఇంత ధర ప్రకారం మరమగ్గాల కార్మికులకు మజ్దూరీ ఇస్తారు. 12 గంటల షిఫ్టులో ఒక కార్మికుడు ఐదు లేదా ఆరు మగ్గాలు ఉపయోగిస్తాడు. సరాసరిన 30 మీటర్ల బట్ట నేస్తాడు. సూరత్‌లో నేత పరిశ్రమ అధికంగా ఉండటంతో ఎక్కువమంది హాస్టళ్లలో ఉంటారు. తాము సంపాదించిన సొమ్ములో కొంతభాగం కుటుంబాలకు పంపుతారు. ఆ హాస్టళ్లు సైతం సరైన సదుపాయాలు లేనివే. కిటకీలు ఉండవు. గాలి సక్రమంగా రాదు. హాలుకు ఓ మూల బాగా డిమ్ముగా వెలిగే ఒక బల్బు మాత్రమే ఉంటుంది. హాస్టళ్లలో కార్మికులు కనీసం ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తారు. నిద్రపోవడానికి సైతం చాలినంత స్థలం ఉండదు. గదుల్లో లైట్లు నిత్యం ఆపే ఉంటాయి. అందరి కోసం బయట రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. తాగునీటి సదుపాయం అంతంత మాత్రమే. కానీ స్నానపు గదుల్లో నీటి సదుపాయం బాగా ఉంది. రాత్రింబవళ్లు మరమగ్గాలు పనిచేస్తూనే ఉంటాయి. ప్రతి ఒక్కరూ హాలులో తాత్కాలిక పడకలు ఏర్పాటు చేసుకున్నారు. రాత్రివేళ కార్మికులు విధులకు హాజరవుతారు. అవకాశం ఉన్నప్పుడు వారు నిద్రపోవడానికి ఏర్పాట్లు ఉంటాయి. పని అయిన తర్వాత తామంతా ఇంటికి వెళతామని, అప్పుడు నిద్రపోతామని సాహు వివరించాడు. నెలకు భోజనం ఖర్చు రూ.2500 నుంచి రూ.3000 వరకు ఉంటుందని ఆయన చెప్పాడు.వాస్తవంగా హాస్టళ్లు నిర్వహించేది కూడా ఒడిశా నుంచి వచ్చిన వలస కార్మికులే. సాధ్యమైనంత వరకు కార్మికులు ఎక్కువ డబ్బు కూడబెట్టాలని చూస్తారు. అయినప్పటికీ వలస కార్మికుల జీవితాలు దుర్భరమేనని ఆయన వ్యాఖ్యానించాడు. సూరత్‌లో పనిచేస్తున్న మరమగ్గాల కార్మికులు దాదాపు 70శాతం మంది ఒడిశా నుంచి వచ్చిన వారే. 8 లక్షల మంది ప్రజలు ఉంటారని అంచనా. సాహు వంటి కార్మికులు దశాబ్దాలుగా చాలామంది ఒంటరిగానే ఇక్కడ జీవిస్తున్నారు. రానున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు వలస కార్మికుల ఓట్లు రాబట్టుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. కానీ వారి సాధకబాధకాలు తెలుసుకోవడం, పరిష్కరించడంపై ఏనాడు శ్రద్ధ చూపలేదు. యజమానుల బాధలు మరో రకం. దశాబ్దం క్రితంతో పోలిస్తే మర మగ్గాల వల్ల లాభాలు 50శాతం పడిపోయాయని ఆవేదన చెందుతున్నారు.

చలి గుప్పిట కశ్మీరం

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో సోమవారం రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత (-)2.2 డిగ్రీలకు చేరగా ఈ సీజన్‌లోనే అత్యంత చలిరోజుగా నిలిచింది. కాగా ఆదివారం (-)1.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏటా అమర్‌నాథ్ యాత్రకు స్థావరంగా పనిచేసే దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో (-) 4.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఉత్తర కశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో (-) 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. రానున్న ఐదు రోజుల్లో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేయడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉంది.

కొలీజియంపై రిజిజు వ్యాఖ్యలు సరికాదు

కాంగ్రెస్ నేత మొయిలీ ధ్వజం

న్యూఢిల్లీ : న్యాయమూర్తుల నియామకాల అంశంపై న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం.వీరప్ప మొయిలీ మంగళవారం విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు దేశ చట్టాన్ని 'పూర్తిగా ధిక్కరించేవి... సుప్రీంకోర్టును 'సవాలు చేసేవి'.... మంత్రికి తగనవి' అని అన్నారు. కొలీజియం వ్యవస్థ 'సమయం పరీక్షించబడింది' అని మాజీ న్యాయ మంత్రి మొయిలీ పేర్కొన్నారు. న్యాయ మంత్రి 'అవరోధ, ధిక్కరించే' విధానాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రధాని నరేంద్ర మోదీ అతనిని తొలగించడం తప్ప మరో మార్గం లేదని అన్నారు. ఉన్నత న్యాయవ్యవస్థలో న్యాయమూర్తులుగా నియామకం కోసం కొలీజియం సిఫారసు చేసిన పేర్లను ఆమోదించడంలో కేంద్రం చేసిన జాప్యం పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసిన ఒక రోజు తర్వాత మొయిలీ ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయశాఖ స్వాతంత్ర్యం పై న్యాయ మంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన ఆందోళన దేశంలోని ప్రతి చట్టాన్ని గౌరవించే పౌరునికి 'కళ్లు తెరిచేది' అని మొయిలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'కొలీజియం వ్యవస్థ సమయం పరీక్షించబడింది. ప్రతి పౌరుడు లేదా ప్రభుత్వానికి కూడా సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టానికి కట్టుబడి ఉండటం తప్ప వేరే మార్గం లేదు. న్యాయమూర్తుల నియామకం విషయంలో న్యాయ శాఖ మంత్రి చేసిన వ్యంగ్య వ్యాఖ్య దేశ చట్టాన్ని పూర్తిగా ధిక్కరించేలా ఉంది' అని కాంగ్రెస్ నేత అన్నారు. 'భారత అత్యున్నత న్యాయస్థానానికి ఇలాంటి సవాలు విసరడం న్యాయ మంత్రికి తగదు. ఇంత బహిరంగ ధిక్కరణతో దేశ ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుంది? ప్రభుత్వంలోని ఏ మంత్రి అయినా మంత్రిగా తాను చేపట్టిన ప్రమాణ స్వీకారానికి అనుగుణంగా పని చేయవలసి ఉంటుంది' అని తెలిపారు. న్యాయ మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు కేబినెట్ సమష్టి అభిప్రాయమా అనేది దేశం తెలుసుకోవాలని మొయిలీ అన్నారు. 'దేశ చట్టం విషయంలో ఏ న్యాయ మంత్రి వ్యక్తిగత అభిప్రాయాన్ని కలిగి ఉండలేరు. దేశం ఎదుర్కొంటున్న ఈ కీలకమైన సమస్య పై ప్రధాని దేశానికి వివరణ ఇవ్వాలి. ప్రస్తుత లేదా అంతకుముందు న్యాయ మంత్రి ఇటువంటి ఘర్షణ వైఖరిని అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. ఎన్‌డీఏ హయాంలో ఇలాంటి బాధ్యతా రహితమైన మాటలు నిరాటంకంగా సాగుతున్నాయి' అని పేర్కొన్నారు. న్యాయమూర్తులు లేదా హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల నియామకంపై కొలీజియం చేసిన సిఫారసులతో ప్రభుత్వం ఏకీభవించనట్లయితే, దానిని కొలీజియం లేదా నియామక ప్రక్రియలో పాల్గొన్న అధికారులకు తిరిగి పంపవచ్చని మొయిలీ అన్నారు. అయితే కొలీజియం సిఫార్సులను నిరవధికంగా నిలుపుదల చేయడం లేదా కొలీజియంపై పదేపదే అలాంటి సూచనలు చేయడం సుప్రీంకోర్టు ఎప్పటికప్పుడు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా లేదని మొయిలీ అన్నారు.

ఎల్జేపీ గుర్తు వివాదం...వ్యక్తిగత విచారణ వాయిదా

న్యూఢిల్లీ: లోక్‌జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) గుర్తు వివాదాన్ని పరిష్కరించడానికి ఎన్నికల సంఘం మంగళవారం చేపట్టవల్సిన వ్యక్తిగత విచారణ వాయిదాపడింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన చిరాగ్ పాశ్వాన్ అభ్యర్థన మేరకు వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎన్నికల సంఘం (ఈసీ) ప్రధానకార్యాలయం నిర్వచన్ సదన్‌లో మంగళవారం మధ్యాహ్నం వ్యక్తిగత విచారణకు హాజరుకావల్సిందిగా చిరాగ్ పాశ్వాన్, పశుపతి కుమార్ పరాస్ నేతృత్వంలోని వర్గాలను ఈసీ ఆహ్వానించింది. అయితే పాశ్వాన్ ఇటీవల వాయిదా కోరినట్లు సమాచారం. కాగా వ్యక్తిగత విచారణ తాజా తేదీని ఈసీ ఇంకా నిర్ణయించాల్సి ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండు ప్రత్యర్థి గ్రూపుల మధ్య వివాదం పరిష్కారమయ్యే వరకు లోక్ జనశక్తి పార్టీ పేరు లేదా దాని ఎన్నికల గుర్తు 'బంగ్లా'ను ఉపయోగించరాదని 2021 అక్టోబరులో ఈసీ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పాశ్వాన్ వర్గం ఇప్పుడు లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)గా పిలువబడుతుండగా అతని మామ నేతృత్వంలోని ప్రత్యర్థి వర్గానికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ పేరు, ఎన్నికల చిహ్నంగా కుట్టు మిషన్‌ను కేటాయించారు. పాశ్వాన్ నేతృత్వంలోని పార్టీకి హెలికాప్టర్ గుర్తును కేటాయించారు.

బాలికపై బాలుడి అత్యాచారం, హత్య!

బెమెతర: పదిహేడేళ్ల బాలుడు తన పొరుగున నివసిస్తున్న 10 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన చత్తీస్‌గఢ్‌లోని బెమెతారా జిల్లాలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన శనివారం కొత్వాలి సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరగ్గా, నిందితుడిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ అంబర్ సింగ్ భరద్వాజ్ తెలిపారు. బెమెతర రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 90 కిలోమీటర్ల దూరంలో ఉంది. బాధితురాలు శనివారం అనుమానాస్పద పరిస్థితుల్లో తన ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినట్లు కనిపించింది. ఈ ఘటనపై విచారణ ప్రారంభించగా బాలికపై లైంగిక దాడి చేసి గొంతుకోసి హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామన్నారు. స్థానికులను విచారించిన అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు. నిందితుడు తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూడటం అలవాటు చేసుకున్నాడు. పోర్న్ చూసిన తర్వాత బాధితురాలి ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులకు చెప్పాడు. బాలిక ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెబుతుందనే భయంతో నిందితుడు ఆమె గొంతుకోసి చున్నీతో ఉరివేశాడని, ఆ తర్వాత అతను టెర్రస్ గుండా పారిపోయాడని అధికారి వివరించారు. నిందితుడిని అరెస్టు చేసి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరిచామని, అతన్ని దుర్గ్ జిల్లాలోని జువైనల్ హోంకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

అసోం-మేఘాలయ సరిహద్దు వివాదంపై ఎన్‌హెచ్‌ఆర్సీ దృష్టి

గుహావతి: అసోం-మేఘాలయ సరిహద్దులోని వివాదాస్పద ప్రాంతంలో హింసాకాండ...ఆరుగురు మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్సీ) దృష్టి సారించింది. రెండు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు వివాదాల ఫలితమే ఈ ఘటన అని పేర్కొంది. ఎలాంటి వివాదం వచ్చినా పోలీసులు సంయమనం పాటించాలని సంఘం అభిప్రాయపడింది. 'నవంబరు 22న మేఘాలయలోని వెస్ట్ జైంతియా జిల్లాలోని ముక్రోహ్ గ్రామంలో అసోం పోలీసులు, అటవీ గార్డులు జరిపిన కాల్పుల్లో ఒక అసోం అటవీ అధికారి సహా ఆరుగురు వ్యక్తులు మరణించారని మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా అందజేసిన ఫిర్యాదుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టి సారించింది' అని సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రాల మధ్య వివాదాస్పద ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి, అసోం ప్రధాన కార్యదర్శిని ఎన్‌హెచ్‌ఆర్సీ కోరింది. రెండు వారాల్లోగా వారి స్పందన తెలియజేయాలని ఆదేశించింది. నవంబర్ 22న ఉదయం అసోంలోని వెస్ట్ కర్బీ అన్‌లాంగ్ జిల్లాకు చెందిన పోలీసులు, అటవీ సిబ్బంది... అక్రమంగా నరికేసిన కలపను మేఘాలయకు తరలిస్తున్నారంటూ ఓ ట్రక్కును అడ్డుకోవడంతో ముక్రోహ్ గ్రామంలో హింస చెలరేగింది.

ఢిల్లీ కార్పొరేషన్ మాదే

అరవింద్ కేజ్రీవాల్ ధీమా

న్యూఢిల్లీ: బీజేపీపై ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం విమర్శలు గుప్పించారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ సక్రమంగా ప్రజలకు పనిచేసి ఉంటే...ఈ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ఇతర పెద్దపెద్ద నాయకులు ఎందుకు ప్రచారం చేస్తారని కేజ్రీవాల్ సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తాము విజయం సాధించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఆప్ అభ్యర్థుల విజయం కోసం కేజ్రీవాల్ చిరాగ్ ఢిల్లీలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు. ముఖాముఖి మాట్లాడారు. డిసెంబరు 4న ఢిల్లీ మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయి. గెలుపుపై ఆప్‌తో పాటు బీజేపీ సైతం పదులకోవడం లేదు. 'నగరంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే. మాకు అధికారం ఇస్తే నగరాన్ని పరిశుభ్రంగా, సుదరంగా మారుస్తాం. రేయింబవళ్లు బీజేపీ నన్ను దూషిస్తోంది. నీటి ఏర్పాటు చేస్తాం. చెత్తకుప్పలను పూర్తిగా తొలగించే బాధ్యత మా ప్రభుత్వానిది. ఆప్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి...గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరాన్ని పరిశ్రభంగా తీర్చిదిద్దుతాం' అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీ వెలిగిపోయేలా చేస్తామన్నారు. కేజ్రీవాల్ ప్రచారం వెంట పాత్రికేయ బృందం కూడా ఉంది. డిసెంబరు 4న జరిగే ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ఆయన ధీమా వెలిబుచ్చారు. 230కి పైగా సీట్లను తాము గెలుచుకుంటామని, బీజేపీకి కేవలం 20 సీట్లు మాత్రమే లభిస్తాయని చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వం చేసిన పనులు మాత్రమే తాము ప్రచారం చేసుకుంటున్నామని, కానీ బీజేపీ మాత్రం ఏమీ చేయనందున ఏమీ చెప్పుకోలేకపోతోందని విమర్శించారు.

రౌడీతో బీజేపీ నేతల చెట్టాపట్టాల్

- నేరస్తులతో పనేంటని కాంగ్రెస్ మండిపాటు
- కర్ణాటకలో రాజకీయ దుమారం

బెంగళూరు: కర్ణాటకలో అధికార బీజేపీ నాయకులు ఓ రౌడీషీటర్ ఏర్పాటు చేసిన రక్తదానశిబిరానికి హాజరుకావడం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ వ్యవహారం కాస్తా చినికి చినికి గాలివానగా మారి చివరికి బీజేపీ వర్సెస్ పోలీసులుగా మారింది. దీంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇరుకునపడింది. బెంగళూరులోని చామరాజ్‌పేట్‌లో ఉన్న బీఎస్ వెంకటరామ్ కళాభవనలో ఆదివారం నగరంలో పెద్ద రౌడీషీటర్‌గా పేరున్న సైలెంట్ సునీల్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి బీజేపీకి చెందిన ఎంపీలు పీసీ మోహన్, తేజస్వీ సూర్య, చిక్ పేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, బెంగళూరు సౌత్ బీజేపీ అధ్యక్షుడు ఎన్నార్ రమేష్ వంటి కీలక నేతలు ఉన్నారు. ఈ రక్తదాన శిబిరం మామూలుగా జరిగిద్దైతే దీనిపై ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు ఉండేవి కావు. కానీ ఒకప్పుడు కాంట్రాక్ట్ కిల్లర్‌గా నగరాన్ని గడగడలాడించిన సునీల్... ఇప్పుడు బీజేపీ ద్వారా రాజకీయ రంగప్రవేశం చేసేందుకు యత్నిస్తున్నాడు. ఇలాంటి తరుణంలో అతను ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి బీజేపీ నేతలు హాజరుకావడం, సునీల్ కూడా కాషాయ కండువాతో దర్శనమివ్వడంతో వివాదం చెలరేగింది. దీంతో కాంగ్రెస్ నేతలు విమర్శలకు దిగారు. ఏఐసీసీ కర్ణాటక ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సూర్జేవాలా ట్వీట్ చేస్తూ, 'పోలీసులకు దొరకని బెంగళూరు రౌడీ షీటర్‌లు మోదీ స్ఫూర్తితో రాజకీయాల్లో చేరి బహిరంగ వేదికపై బీజేపీ నేతలతో దొరికిపోయారు... గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారు ఇప్పుడు బీజేపీ, మోదీల నుంచి స్ఫూర్తి పొందారు' అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్, ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య కూడా బీజేపీపై విరుచుకుపడ్డారు. బీజేపీ నేతలు కరడుగట్టిన క్రిమినల్స్ తో తిరుగుతుంటే నగరంలో క్రైమ్ రేట్ తగ్గుతుందా అంటూ కాంగ్రెస్ నేతలు హోంమంత్రి అరగ జ్ఞానేంద్రను ప్రశ్నించారు. నగర పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్న సునీల్ వంటివారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొనడం ఎలాంటి సంకేతాలనిస్తుందని నిలదీశారు. పోలీసులకు దొరకని మోస్ట్ వాంటెడ్ సునీల్... బీజేపీ నేతలకు మాత్రం దొరికాడంటూ సెటైర్లు కూడా వేస్తున్నారు. దీంతో ప్రభుత్వంతో పాటు పోలీసులు కూడా ఇరుకునపడ్డారు. ఈ కార్యక్రమంపై నగర పోలీసు కమిషనర్ ప్రతాప్ రెడ్డి క్రైమ్ బ్రాంచ్ వివరణ కోరారు. అయితే సునీల్ పై ఎలాంటి కేసులు పెండింగ్ లో లేవని, వారంట్లు, సమన్లు కూడా లేవని, కాబట్టి ఈ కార్యక్రమం విషయంలో అతనిపై చర్యలు తీసుకునే పరిస్థితులు లేవని వారు నివేదించారు.

ఆ నేతలను వివరణ కోరతా: కర్ణాటక బీజేపీ చీఫ్

రౌడీషీటర్ సైలెంట్ సునీల్‌తో వేదిక పంచుకున్న పార్టీ నేతలను వివరణ కోరతానని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్ మంగళవారం తెలిపారు. 'సైలెంట్ సునీల్‌ని ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలో చేర్చుకోము. ఆయనతో పాటు కొందరు పార్టీ నేతలు ఓ కార్యక్రమంలో పాల్గొనడంపై సమాచారం సేకరిస్తున్నాను. ఆ నేతల నుంచి వివరణ కోరుతాం' అని కటీల్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నేతలను గట్టిగా ఆదేశించామని, అన్ని విషయాలను పార్టీ దృష్టికి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. ఉగ్రవాదులను, ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతిచ్చే వారిని, నేర నేపథ్యం ఉన్నవారిని పార్టీ ఎప్పటికీ సహించబోదని ఆయన అన్నారు. ఒకప్పుడు బెంగళూరులో అత్యంత భయంకరమైన కాంట్రాక్ట్ కిల్లర్‌గా పేరుబడ్డ సునీల్, ఇప్పుడు తాను నేర కార్యకలాపాలకు దూరంగా ఉన్నానని, సమాజానికి సేవ చేపట్టానని చెబుతున్నాడు.

నోయిడా కొత్త సీపీగా లక్ష్మిసింగ్

నోయిడా: నోయిడా నూతన పోలీసు కమిషనర్‌గా మహిళా ఐపీఎస్ అధికారి లక్ష్మిసింగ్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం నియమించింది. ఓ మహిళా ఐపీఎస్ అధికారి పోలీసు కమిషనర్‌గా నియమితులు కావడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి. 2000వ సంవత్సరపు బ్యాచ్‌కు చెందిన లక్ష్మిసింగ్ బుధవారం బాధ్యతలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటి వరకు నోయిడా పోలీసు కమిషనర్‌గా అలోక్‌సింగ్ పనిచేశారు. వారణాసి, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్ కొత్త కమిషనర్లు సహా రాష్ట్రంలో 16మంది ఐపీఎస్ అధికారులను యూపీ ప్రభుత్వం సోమవారం అర్ధరాత్రి బదిలీ చేసింది. యూపీలో ప్రస్తుతం ఏడు పోలీసు కమిషనరేట్లు ఉన్నాయి. 1995వ బ్యాచ్‌కు చెందిన అలోక్‌సింగ్ అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించి...డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. 48 ఏళ్ల లక్ష్మిసింగ్ లక్నో రేంజ్ ఐజీపీగా పనిచేశారు. లక్ష్మిసింగ్ మంచి పోలీసు అధికారిగా గుర్తింపు పొందారు. యూపీఎస్‌సీ పరీక్షలో ఆమె 33వ ర్యాంకు సాధించారు. ఆమె మొదటి ఐపీఎస్ టాపర్. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ అకాడమీలో ఆమె శిక్షణ పొందారు. శిక్షణాకాలంలో ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. లక్ష్మిసింగ్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. 2004లో సీనియర్ ఎస్పీగా ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు.

విష ప్రచారాన్ని సహించం: స్టాలిన్

తిరుచిరాపల్లి: నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తానని, అదేసమయంలో తనపైనా, డీఎంకే ప్రభుత్వంపైనా దుష్ప్రచారాన్ని సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టంచేశారు. విమర్శలకు తాము వ్యతిరేకం కాదని, అయితే విమర్శలు చేసే అర్హత ప్రతిపక్ష ఏఐఏడీఎంకేకు లేదని ఆయన పేర్కొన్నారు. తనపైనా, తన ప్రభుత్వంపైనా అన్నా డీఎంకే విషప్రచారం చేస్తోందని ఆయన మంగళవారం మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ అన్నా డీఎంకే సమర్థ పాలన అందించలేదని విమర్శించారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదనడానికి గత అన్నా డీఎంకే, ఆ పార్టీ సీఎం నిదర్శనమని వ్యాఖ్యానించారు. దశాబ్దకాలం అధికారం అనుభవించి.. ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పుడు మాత్రం గొప్పలు చెప్పుకుంటుందని ఆరోపించారు. స్టాలిన్ అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని, కానీ కొన్ని విచ్ఛిన్నకర శక్తులు రాష్ట్రంలో శాంతిని, సామరస్యాన్ని తట్టుకోలేకపోతున్నాయని స్టాలిన్ అన్నారు. తప్పుడు ప్రచారం ద్వారా రాష్ట్రంలో అశాంతి సృష్టించడానికి కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. విమర్శలు చేయండని, విషప్రచారం మాత్రం చేయొద్దని హితవు పలికారు.

గుజరాత్‌లో బీజేపీ ధనబలం

అహ్మదాబాద్ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో అత్యధిక సంఖ్యలో 'కోటీశ్వరులు' అయిన అభ్యర్థులను కలిగి ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల జాబితాలో బీజేపీ అగ్రస్థానంలో ఉంది. అంతేకాకుండా, ఈ ఎన్నికలలో 2022లో పోటీ చేస్తున్న అత్యధిక ఆస్తులు కలిగిన మొదటి ముగ్గురు అభ్యర్థులలో ఇద్దరు బీజేపీకి చెందినవారు కావడం విశేషం. వీరిలో జయంతిభాయ్ సోంభాయ్ పటేల్ (బీజేపీ) రూ.661 కోట్ల ఆస్తులను ప్రకటించగా, బల్వంత్ సింగ్ చందన్ సింగ్ రాజ్‌పుత్ (బీజేపీ) రూ.372 కోట్ల ఆస్తులను ప్రకటించగా, ఇక మూడవ అభ్యర్థి అజిత్ సింగ్ పర్సోత్తమ్ దాస్ ఠాకూర్ (ఆప్) రూ.343 కోట్ల ఆస్తులను ప్రకటించారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక ప్రకారం గత ఐదేళ్లలో కోటీశ్వరుల అభ్యర్థుల వాటా పెరిగింది. 1,621 మంది అభ్యర్థులలో 456 (28 శాతం) మంది కోటీశ్వరులు కాగా, 1,815 మంది అభ్యర్థుల్లో 418 (23 శాతం) మంది కోటీశ్వరులు. 'అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సంపన్న అభ్యర్థులకు టికెట్లు ఇవ్వడం ద్వారా ఈ ఎన్నికల్లో ధనబలం పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన పార్టీలలో 182 మంది అభ్యర్థుల్లో 154 మంది (85 శాతం) బీజేపీ, కాంగ్రెస్ నుంచి 179 మంది అభ్యర్థుల్లో 142 మంది (79 శాతం), ఆప్ నుంచి విశ్లేషించిన 181 మంది అభ్యర్థుల్లో 68 మంది (38 శాతం) ఆస్తులను ప్రకటించారు. కోటి రూపాయలకు పైగా విలువ విలువ చేస్తుంది' అని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే ఒక్కో అభ్యర్థి ఆస్తుల సగటు రూ.3.58 కోట్లు. 2017 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో 1,815 మంది అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.2.22 కోట్లు అని వివరించింది. ప్రధాన పార్టీలలో 182 మంది బీజేపీ అభ్యర్థులకు ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తులు రూ.16.56 కోట్లుగా ఉంది. 179 మంది కాంగ్రెస్ అభ్యర్థులు రూ.7.99 కోట్లు, 181 మంది ఆప్ అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.3.68 కోట్లు, 26 భారతీయ గిరిజన పార్టీల సగటు ఆస్తుల విలువ రూ.21.68 లక్షలు అని వివరించింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), గుజరాత్ ఎన్నికల నిఘా సంస్థ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల మొదటి, రెండవ దశల్లో పోటీ చేస్తున్న మొత్తం 1,621 మంది అభ్యర్థుల స్వీయ ప్రమాణ పత్రాలను విశ్లేషించాయి. 1,621 మంది అభ్యర్థులు విశ్లేషించగా, 476 మంది జాతీయ పార్టీలు, 219 మంది రాష్ట్ర పార్టీలు, 302 మంది రిజిస్టర్డ్ గుర్తింపు లేని పార్టీలు, 624 మంది అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నేరచరితులూ అధికమే

కాంగ్రెస్, బీజేపీ, ఆప్ నుంచి ఎన్నికల బరిలో ఉన్న 96 మంది సహా మొత్తం 192 మంది అభ్యర్థుల పై హత్య, అత్యాచారం, హత్యాయత్నానికి సంబంధించిన తీవ్రమైన నేరాల కింద కేసులు నమోదయ్యాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. గతంలో కంటే ఎక్కువ మంది అభ్యర్థులు నేర చరిత్ర ఉన్నవారేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం... ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 1,621 మంది అభ్యర్థుల్లో 330 మంది అంటే దాదాపు 20 శాతం అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. ఆ జాబితాలో అత్యధిక మంది (61) నేర చరిత్ర ఉన్న వారు ఆమ్ ఆద్మీ పార్టీ నుంచే ఉన్నారని తెలిపింది. 2017 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థుల సంఖ్య 238గా ఉందని వివరించింది. తొలి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న 788 అభ్యర్థుల్లో 170 మంది వరకూ నేరచరితులు ఉన్నారని, వీరిలో 100 మందిపై అత్యాచారం, హత్య వంటి అతి తీవ్ర నేరాలు కూడా నమోదయి ఉన్నాయని నివేదిక పేర్కొంది. పార్టీల పరంగా పరిశీలిస్తే... తొలివిడతలో ఆమ్ ఆద్మీ పార్టీ 89 సీట్లకు గానూ 88 సీట్లలో పోటీ చేస్తోంది. ఇందులో దాదాపు 30 శాతం అభ్యర్థుల పై హత్య, అత్యాచారం, దౌర్జన్యం, కిడ్నాప్ కేసు నమోదయ్యాయని ఏడీఆర్ తెలిపింది. ఆ తర్వాత స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉందని, తొలివిడతలో పోటీ చేసే వారిలో 20 శాతం కాంగ్రెస్ అభ్యర్థుల్లో నేరచరిత్ర గలవారే ఉన్నారని తెలిపింది. అలాగే అధికార బీజేపీ తొలి విడతలో అన్ని సీట్లలో పోటీ చేస్తోంది. వారిలో12 శాతం అభ్యర్థుల పై క్రిమినల్ కేసులున్నాయని వెల్లడించింది. కాగా రెండు దశల అభ్యర్థుల సర్వే అనంతరం ఏడీఆర్ సోమవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం... అత్యధిక మంది(61) నేర చరిత్ర ఉన్న వారు ఆమ్ ఆద్మీ పార్టీ నుంచే ఉండే ఉన్నారని తెలిపింది. కాంగ్రెస్‌కు చెందిన 60 మంది అభ్యర్థుల పై, అధికార బీజేపీకి చెందిన 32 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. మొత్తం 192 మంది అభ్యర్థులపై హత్య, అత్యాచారం, హత్యాయత్నానికి సంబంధించిన తీవ్రమైన నేరాల కింద కేసులు నమోదు ఉన్నాయని తెలిపింది. అహ్మదాబాద్ జిల్లాలోని దస్క్రోయ్ స్థానం నుంచి ఆప్ టికెట్ పై పోటీ చేస్తున్న కిరణ్ పటేల్ పై హత్య కేసు నమోదయింది. పటాన్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కిరీట్ పటేల్ పై హత్యాయత్నం కేసు నమోదు చేయగా, పంచమహల్ జిల్లాలోని షెహ్రా స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీకి చెందిన జెఠా భర్వాద్ పై అత్యాచారం, అపహరణ, దోపిడీ, రెచ్చగొట్టడం వంటి అభియోగాలు ఉన్నాయి.

85 శాతం మంది అభ్యర్థులు కోటీశ్వరులే!

మచిలీపట్నంలో

గుంటూరులో

అగ్రిగోల్డ్ బాధితులకు

తక్షణం చెల్లింపులు చేపట్టాలి

- ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి
- జంగాల, కోట, కేతినేని డిమాండ్
- ముగిసిన ధర్మాగ్రహ నిరాహార దీక్ష

విజయవాడలో

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన 30 గంటల ధర్మాగ్రహ నిరాహార దీక్ష మంగళవారం సాయంత్రం ముగిసింది. తొలుత ఉదయం పూట కొనసాగిన దీక్షలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్, నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను నేడు విస్మరించారన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితులలో ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైన వారి కుటుంబాలకు వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న రూ.10, రూ.20 వేల లోపు బాధితులందరికీ తక్షణమే చెల్లింపులు చేపట్టాలని, 2022 డిసెంబర్ 31లోపు రూ.20 వేల పైబడిన బాధితులందరికీ పూర్తి చెల్లింపులు జరిగేటట్లు స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు అధికారంలోకి వచ్చిన తర్వాత నీటిమూటలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి బాధితుడికి చివరి పైసా వచ్చే వరకు అగ్రిగోల్డ్ బాధితులకు అండగా సీపీఐ ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సాయంత్రం అసోసియేషన్ నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపచేశారు. దీక్షలో కేతినేని అగస్టీన్, ముప్పాళ్ల శివశంకర్, పీవీ సాంబశివరావు, షేక్ కరిముల్లా, ఆర్.ఇన్నయ్య, రామారావు, హనుమంతరావు, మరియదాస్, జె.అంజనీదేవి, కోటేశ్వరమ్మ, పెదబాబు, జి.సంజీవరావు, జీవీ రమణ, నాగరాజకుమారి, ధనలక్ష్మి, నాగరాజు, టి.యోహాను, కోట భారతి, కోట రత్నకుమారి కూర్చొన్నారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతీ ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నగర కార్యదర్శి చల్లా మరియదాస్, నరసరావుపేట పట్టణ సీపీఐ కార్యదర్శి వైధన వెంకట్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, నగర కార్యదర్శి చెవుల పున్నయ్య, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, మొహమ్మద్ జైద్ తదితరులు దీక్షలకు మద్దతు తెలిపారు.

బాధితులందరికీ న్యాయం చేయాలి: కేవీవీ ప్రసాద్

విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితులందరికీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో విజయవాడ దాసరి భవన్ వద్ద చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల 30 గంటల ధర్మాగ్రహ నిరాహార దీక్షలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై మంగళవారం సాయంత్రం 4 గంటలకు విరమణ జరిగింది. దీక్షలో కూర్చొన్న బి.వి.చంద్ర శేఖర్ రావు, ఎ.వి.రాంబాబు, చక్కా జగన్మోహన్‌లకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ స్వాధీనం చేసుకున్న అగ్రిగోల్డ్ సంస్థ వేల కోట్ల ఆస్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి బాధితులందరికీ పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య నాయకులు దుర్గాంబ, భారతి, ఏఐవైఎఫ్ గోవిందరాజులుకు అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బి.వి.చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందన ప్రభుత్వానికి పట్టదా?

మచిలీపట్నం టౌన్ : అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందన ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని అగ్రిగోల్డ్ ఏజెంట్స్, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టి.ఏడుకొండలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ధర్నా చౌక్ వద్ద జిల్లా అధ్యక్షులు కె.గగన్, ఎస్.మార్క్, కె.వరలక్ష్మి, పి.శేషకుమారి అధ్వర్యంలో చేపట్టిన ధర్మాగ్రహ నిరాహార దీక్ష మంగళవారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలై లక్షల మంది జీవితాలు తారుమారయ్యి, కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని, వెంటనే ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రూ.20 వేల లోపు మొత్తం ఉన్న బాధితులందరికీ పూర్తి న్యాయం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు కె.గగన్ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న అగ్రిగోల్డ్ సంస్థ వేల కోట్ల ఆస్తులను కొనుగోలు చేసి బాధితులకు పూర్తిగా నష్టపరిహారం అందించాలని, అలాగే ఇంత ద్రోహానికి ఒడిగట్టిన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దీక్షలో వెంకట రమణమ్మ, షేక్ జాన్‌బీ, సిహెచ్ ప్రసన్నకుమారి, ఇ.వి.నాగేశ్వరమ్మ, బి.ఎన్.సునీత, కనకయ్య, శివయ్య, వి.నాగలక్ష్మణ రావు, అబ్దుల్ అలీ కూర్చొన్నారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు సహాయ సహకారాలు అందించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలోని అధికారికి వినతి పత్రం అందజేశారు.

గుజరాత్‌లో ముగిసిన తొలిదశ ఎన్నికల ప్రచారం

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు తొలిదశ ప్రచారానికి మంగళవారంతో తెరపడింది. సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. డిసెంబరు 1న (గురువారం) పోలింగ్ జరుగుతుంది. దక్షిణ గుజరాత్, కచ్-సౌరాష్ట్రలోని 19 జిల్లాలవ్యాప్తంగా 89 స్థానాల నుంచి 788 మంది పోటీలో ఉన్నారు. సాధారణంగా రాష్ట్రంలో బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య పోరు ఉంటుంది కానీ ఈసారి ఆప్ ఎంట్రీతో త్రిముఖ పోరు నెలకొంది. మొత్తం 182కుగాను 181 స్థానాల నుంచి ఆప్ పోటీ చేస్తోంది. తొలిదశలో అన్ని స్థానాల నుంచి కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటీ చేస్తున్నారు. 788 మంది అభ్యర్థుల్లో 718 మంది పురుషులు, 70 మంది మహిళలు ఉన్నారు. బీఎస్పీ 57 మంది అభ్యర్థులను నిలబెట్టింది. భారతీయ గిరిజన పార్టీ 14 మందిని, సమాజ్ వాదీ పార్టీ 12 మందిని, సీపీఎం నుంచి నలుగురు, సీపీఐ నుంచి ఇద్దరు పోటీలో ఉండగా 339 మంది స్వతంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2,39,76,670 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. చివరి రోజు ప్రచారంలో బీజేపీ నేతలు అమిత్‌షా, నడ్డా, ఆదిత్యనాథ్, ప్రమోద్ సావంత్ ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు. ఈనెల 27-28 తేదీల్లో నెత్రాంగ్, ఖేదా, పలిటనా, అంజర్, జామ్‌నగర్, రాజ్‌కోట్‌లో ప్రధాని మోదీ ప్రచారం చేశారు. కాంగ్రెస్ తరపున మల్లికార్జున ఖడ్గే ప్రచారం నిర్వహించారు.

ఉగ్రదాడులను నివేదించేటప్పుడు

మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ: తీవ్రవాద దాడులను ప్రత్యక్షంగా నివేదించేటప్పుడు మీడియా జాగ్రత్తగా ఉండాలని, దాడి చేసేవారికి, వారి చెడు ఉద్దేశాలకు ఆధారాలు ఇవ్వకూడదని సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మంగళవారం సూచించారు. 'భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, మరీ ముఖ్యంగా ఉగ్రవాద దాడుల విషయంలో మీడియా బాధ్యతతో రిపోర్టు చేయాలి. ఉగ్ర దాడి జరిగినప్పుడు ఏదైనా ప్రత్యక్ష ప్రసార రిపోర్టింగ్ దాడి చేసేవారికి, వారి దురుద్దేశాలకు ఆధారాలు ఇవ్వకూడదని మీడియా నిర్ధారించుకోవాలి' అని ఆసియా-పసిఫిక్ బ్రాడ్‌కాస్టింగ్ యూనియన్ (ఏబీయూ) జనరల్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ ఠాకూర్ అన్నారు. 'సమాచారం ప్రసారం చేసే వేగం ముఖ్యమైనది అయితే, కచ్చితత్వం మరింత ముఖ్యమైనది. అది నివేదించే వారి మనస్సులలో ప్రాథమికంగా ఉండాలి' అని ఠాకూర్ తెలిపారు. బాధ్యతాయుతమైన మీడియా సంస్థలకు ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం అత్యున్నత మార్గదర్శక సూత్రంగా ఉండాలని కేంద్ర మంత్రి అన్నారు. కోవిడ్-19 అవగాహన సందేశాలు, ముఖ్యమైన ప్రభుత్వ మార్గదర్శకాలు, వైద్యులతో ఉచిత ఆన్‌లైన్ సంప్రదింపులు దేశంలోని ప్రతి మూలమూలలో ప్రతి ఒక్కరికీ చేరేలా భారతీయ మీడియా నిర్ధారిస్తుందని తెలిపారు. భారతదేశ ప్రజా ప్రసార సంస్థ అయిన ప్రసార భారతి కోవిడ్-19 కారణంగా వంద మంది సభ్యులను కోల్పోయింది. అయినప్పటికీ సంస్థ తన ప్రజా సేవా ఆదేశాన్ని కొనసాగించకుండా నిరోధించలేదని మంత్రి చెప్పారు. ఏబీయూ... ప్రసార సంస్థల సంఘంగా సంక్షోభ సమయాల్లో మీడియా పాత్రపై అత్యుత్తమ వృత్తిపరమైన నైపుణ్యాలతో మీడియా అభ్యాసకులకు శిక్షణ ఇవ్వడం, సన్నద్ధం చేయడం కొనసాగించాలని ఆయన అన్నారు. ప్రసార భారతి 59వ ఏబీయూ మహాసభకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ సంవత్సరం ఇతివృత్తం 'ప్రజలకు సేవ చేయడం: సంక్షోభ సమయాల్లో మీడియా పాత్ర'.

మీకేమైనా 100 తలలున్నాయా?: ఖడ్గే

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కొన్ని గంటల్లో ముగియనుండగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే... ప్రధాని నరేంద్ర మోదీ పై 'రావణ్' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని 'రావణుడు'తో పోల్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు గుజరాత్‌లో రాజకీయ దుమారాన్ని రేపాయి. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ వ్యాఖ్య గుజరాతీల పై ప్రతిపక్ష పార్టీ ద్వేషాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో 182 మంది సభ్యుల అసెంబ్లీకి డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు ముందు బీజేపీ అభ్యర్థుల కోసం ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తు న్నారు. ఖడ్గే సోమవారం రాత్రి అహ్మదాబాద్ నగరంలోని కాంగ్రెస్ అధీనంలో ఉన్న దానిలిమ్డా నియోజకవర్గానికి చెందిన బెహ్రాంపురా ప్రాంతంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. మోదీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్ని ఎన్నికల్లో తన ముఖం చూసి ఓటు వేయాలని ప్రధాని ప్రజలను కోరుతున్నారని, మోదీజీ మీకు రావణుడిలా పది తలలున్నాయా అని ప్రశ్నించారు. 'మోదీజీ ప్రధాన మంత్రి. తన పని మరిచిపోయి... కార్పొరేషన్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు, అసెంబ్లీ, లోక్‌సభ... ఇలా ప్రతిచోటా ప్రచారం చేస్తున్నారు. అన్ని వేళలా తన గురించే మాట్లాడతారు. నన్నే చూసి ఓటేయండి... ఇంకెవరినీ చూడనవసరం లేదని అంటున్నారు. మోదీజీ మీ ముఖాన్ని మేం ఎన్నిసార్లు చూడాలి? మీకు ఎన్ని రూపాలు ఉన్నాయి? రావణుడిలా మీకేమైనా 100 తలలు ఉన్నాయా?' అని ఖడ్గే అన్నారు. మోదీకి ఓటు వేయాలని బీజేపీ ప్రజలను అడుగుతుందని తెలిపారు. ప్రతి ఎన్నికల్లోనూ అభ్యర్థులు మోదీ పేరు చెప్పి ఓట్లు అడిగారని, అవి మునిసిపాలిటీ ఎన్నికలయినా, కార్పొరేషన్, అసెంబ్లీ ఎన్నికలయినా సరే అభ్యర్థి పేరు మీద ప్రజలను ఓట్లు అడగాలి. మోదీ వచ్చి ఏమైనా మునిసిపాలిటీకి పని చేస్తారా? మీకు అవసరమైన సమయాల్లో ఆయన మీకు సాయం అందిం చగలరా? అని ఖడ్గే ప్రశ్నించారు. 27 ఏళ్ల క్రితం గుజరాత్‌లోనూ, కేంద్రంలోని తమ ప్రభుత్వం, గత కాంగ్రెస్ ప్రభుత్వాల పని తీరుపై ఓట్లు అడగాలని బీజేపీని కోరారు.

'పుష్ప' రష్యన్ ట్రైలర్ విడుదల

హైదరాబాద్: సుకుమార్ దర్శకత్వంలో టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ నటించిన సినిమా 'పుష్ప: ది రైజ్' ... గతేడాది డిసెంబర్ 17న విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన సంగతి విదితమే. బాలీవుడ్‌లో అయితే ఏకంగా 120కోట్లకు పైగా కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది. 'పుష్ప' విడుదలై ఏడాది కావస్తున్నా అంతర్జాతీయంగా ఈ చిత్రం గురించి అందరూ చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాతలు 'పుష్ప' ను రష్యాలో విడుదల చేయనున్నారు. 'పుష్ప' రష్యాలో డిసెంబర్ 8న విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. అందులో భాగంగా రష్యన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. రష్యన్ అభిమానులను ఆకట్టుకునేందుకు చిత్ర బృందం డిసెంబర్ 1న మాస్కోలో, డిసెంబర్ 3న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో మీడియాతో ముచ్చటించనుంది. కొన్ని రోజుల క్రితం పుష్ప చిత్రాన్ని మాస్కో ఫిలిం ఫిస్టివల్‌లో ప్రదర్శించారు. బ్లాక్‌బస్టర్స్ కేటగిరీ కింద ఈ చిత్రాన్ని స్క్రీన్ చేశారు. ఆ సమయంలో రష్యన్ అభిమానుల నుంచి మంచి స్పందన రావడంతో మరింత మంది ప్రేక్షకులకు సినిమాను చేరువ చేయాలని నిర్మాతలు... రష్యన్ భాషలోకి డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. 'పుష్ప: ది రైజ్' లో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించింది.

గిన్నిస్ బుక్‌కు ఎక్కాల్సిన పొయెట్రీ వర్క్ షాప్

విశాలాంధ్ర-హైదరాబాద్: డా.ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్ నిర్వహణలో వెలువడిన పొయెట్రీ వర్క్ షాప్ గిన్నిస్ బుక్ లోకి, లింకా బుక్ ఆఫ్ రికార్డ్సులోకి ఎక్కవలసిందని ఈ పుస్తకాన్ని ఆవిష్కరిం చిన ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. 182 మంది కవుల చేతి రాత ఒక వేపు, మరో వేపు ముద్రితమైన కవితలతో పొయెట్రీ వర్క్ షాప్ ప్రచురించడం అపురూపం అని ఆయన అన్నారు. ఇందులో ఉన్న కవిత్వం ఉత్తమమైందా కాదా అన్న ప్రశ్నకు తావులేదనీ, కవిత్వం రాసేటప్పుడు కవులు పడే శ్రమను ఈ గ్రంథం రికార్డు చేసిందని శ్రీనివాస్ చెప్పారు.

కవుల చేతిరాతను, ముద్రిత కవితను పోల్చి చూసుకోవడానికి ఈ వినూత్న ప్రయోగం ఉపకరిస్తుందని ఈ సమావేశంలో పాల్గొన్న గౌరవ అతిథి ఆచార్య కొలకలూరి ఇనాక్ అభిప్రాయపడ్డారు. ఈ గ్రంథంలో కవుల దస్తూరీతో పాటు వారు రాసే క్రమంలో జరిగిన దిద్దుబాట్లు కవిత్వ రచనలో ఉన్న శ్రమకు తార్కాణమని ఆయన చెప్పారు. కవిత్వం భవన నిర్మాణంలో పడ్డ శ్రమను ఈ గ్రంథం కళ్లకు కట్టినట్టు చూపుతుందని విశిష్ట అతిథి, ప్రసిద్ధ కవి నిఖిలేశ్వర్ కొనియాడారు. 1862 నుంచి 1962 మధ్య పుట్టిన కవులు చేసిన ప్రయాణానికి ఇది దర్పణం అని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో డా. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ, ఈ పుస్తకాన్ని చూస్తే కవులు ఊరేగింపుగా వెళుతున్నట్టు ఉందని అన్నారు. పొయెట్రీ వర్క్ షాప్ నిర్వాహకులలో ఒకరైన డా. ఏటుకూరు ప్రసాద్ ఇలాంటి గ్రంథాన్ని వెలువరించడం వెనక ఉన్న ఆలోచనను వివరించడంతో పాటు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ గ్రంథంలో తాతలు, తండ్రులు, కొడుకులు, కూతుర్లు, బావలు, బావమరుదులు అయిన కవుల రచనలున్నాయని చెప్పారు. రాపోల్ సుదర్శన్ స్వాగతం పలికితే నవచేతన పబ్లిషింగ్ హౌస్ తరపున నారాయణ రెడ్డి వందన సమర్పణ చేశారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ తదితరులు పాల్గొన్నారు.

'యశోద' విడుదలకు తొలగిన అడ్డంకులు

హైదరాబాద్: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటించిన సినిమా యశోద. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో నవంబర్ 11న విడుదలైంది. సరోగసీ అంశం చుట్టూ తిరిగే కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రంపై ఈవా ఐవీఎఫ్ హాస్పిటల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. యశోద చిత్రంలో తమ ఆస్పత్రిని వ్యతిరేక కోణంలో చూపించారని, యశోద సినిమా ప్రదర్శనను నిలిపేయాలని కోరుతూ ఈవా ఐవీఎఫ్ హాస్పిటల్ టీం యశోద మేకర్స్ పై హైదరాబాద్ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో యశోద ఓటీటీ విడుదలను వాయిదా వేయాలని ఆదేశాలు జారీ చేస్తూ కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. డిసెంబర్ 19 వరకు యశోదను ఓటీటీలో విడుదల చేయొద్దని మేకర్స్ కు నోటీసులు కూడా జారీ చేసింది. కాగా ఈ వ్యవహారంలో చిత్ర నిర్మాతలు-ఈవా హాస్పిటల్ బృందం రాజీకి వచ్చారు. యశోదలో ఈవా పేరు కథాంశానికి అనుగుణంగానే పెట్టామని, ఇంకొకరి మనోభావాలు దెబ్బతీసేందుకు మాత్రం కాదని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. ఈవా హాస్పిటల్ టీంను కలిసి పూర్తి వివరాలు చెప్పాను. భవిష్యత్‌లో ఇకమీదట ఈవా అనే పదం యశోద సినిమాలో కనపడదని, ఇది తెలియక జరిగిన చిన్న పొరపాటు మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. తమ నిర్ణయానికి ఈవా సంస్థ కూడా అంగీకారం తెలిపిందని, పేరు విషయంలో నెలకొన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. ఈ విషయంపై ఈవా హాస్పిటల్ ఎండీ మోహన్ రావు మాట్లాడుతూ... సినిమాలో మా హాస్పిటల్ పేరును వినియోగించిన విషయాన్ని నిర్మాత దృష్టిని తీసుకెళ్లగా, వెంటనే సమస్యను పరిష్కరించడంతో వివాదం సమసిపోయిందని తెలిపారు.

తెలుగు తెరపై మరో కన్నడ సుందరి

హైదరాబాద్: కన్నడ నుంచి మరో సుందరి తెలుగు తెరకి పరిచయమవుతోంది... ఆ సుందరి పేరే 'కావ్య శెట్టి'. మంగళూరులో పుట్టి పెరిగిన కావ్య, 2013లోనే కన్నడ సినిమా ద్వారా పరిచయమైంది. ఆ వెంటనే పెద్దగా ఆలస్యం లేకుండా కోలీవుడ్‌లో అడుగు పెట్టింది. ఇక ఈ మధ్యనే మలయాళంలో కూడా ఎంట్రీ ఇచ్చిన కావ్య, 'గుర్తుందా శీతాకాలం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సత్యదేవ్ హీరోగా నటించిన ఈ సినిమాలో తమన్నా, మేఘ ఆకాశ్ తో పాటు మూడో హీరోయిన్‌గా కావ్య శెట్టి కనిపించనుంది. డిసెంబర్ 9వ తేదీన ఈ సినిమా విడుదలవుతోంది. ఈ చిత్రంలో తన పాత్రను చూసి అంతా తిట్టుకుంటారనీ, అదే జరిగితే మాత్రం తాను ఆ పాత్రకి న్యాయం చేసినట్టేనని కావ్య చెబుతోంది. భవాని రవి, రామారావు నిర్మించిన ఈ సినిమాలో, సత్యదేవ్ మూడు వేర్వేరు పాత్రల్లో కనిపించనున్నాడు. కీలకమైన పాత్రలో సుహాసిని నటించింది.

లాథమ్ వికెట్ కీలకం: జాఫర్

నేడు మూడో వన్డే

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో అమీతుమీకి టీమిండియా సిద్ధమవుతోంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో గెలుపొంది కివీస్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో బుధవారం క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరగబోయే ఆఖరి మ్యాచ్ కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైన గెలిచి 1-1తో సిరీస్‌ను సమం చేయాలని టీమిండియా భావిస్తోంది. కాగా మూడో వన్డేలో భారత్ జట్టు విజయం సాధించాలంటే టామ్ లాథమ్ వికెట్ కీలకమని మాజీ ఓపెనర్ వసీం జాఫర్ అభిప్రాయపడ్డాడు. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫోతో మంగళవారం జాఫర్ మాట్లాడుతూ... మధ్య ఓవర్లలో లాథమ్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటాడని, అందుకని అతని వికెట్ కీలకం అని చెప్పాడు. మూడో వన్డేలో లాథమ్ నుంచే భారత్‌కు ముప్పు ఎక్కువని, అతని వికెట్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచించాలని సూచించాడు. జట్టులో ఏమైనా మార్పులు చేయాలా? అన్న ప్రశ్నకు అవసరం లేదని, రెండో వన్డే ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలని బదులిచ్చాడు. మొదటి వన్డేలో న్యూజిలాండ్ 307 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో లాథమ్ కీలక పాత్ర పోషించాడు. 20 ఓవర్లలోపు న్యూజిలాండ్ 3 వికెట్లు కోల్పోయి 88 పరుగులు మాత్రమే చేసింది. కానీ, ఆ తర్వాత లాథమ్ దూకుడు పెంచడంతో కివీస్ జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆ మ్యాచ్‌లో లాథమ్ 104 బంతుల్లో 145 పరుగులు చేశాడు. రెండో వన్డేలో గెలిచి సిరీస్ సమం చేద్దామనుకున్న భారతజట్టుకు నిరాశే మిగిలింది. వర్షం కారణంగా రెండో వన్డే రద్దయింది.

'సెలెక్టర్' రేసులో మణీందర్, కాంబ్లి

ముంబై: భారత క్రికెట్ జట్టు (పురుషులసీనియర్ విభాగం)ను ఎంపిక చేసే సెలెక్టర్ల పదవి కోసం దరఖాస్తు చేసుకొనేందుకు బీసీసీఐ విధించిన గడువు సోమవారంతో ముగిసింది. ఐదు పోస్టుల కోసం దాదాపు 50 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే వీరిలో మాజీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మణీందర్ సింగ్, మాజీ ఓపెనర్ శివసుందర్ దాస్, వినోద్ కాంబ్లి ఉన్నారు. దరఖాస్తుదారుల్లో బాగా తెలిసిన ఆటగాళ్లు వీరే.. ఇక మాజీ పేసర్ అజిత్ అగార్కర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యే అవకాశం ఉందని వార్తలొస్తున్నాయి. అయితే అగార్కర్ దరఖాస్తు చేశాడో లేదో మాత్రం తెలియరాలేదు. ముంబై జోన్ నుంచి కాంబ్లితో పాటు సీనియర్ ముంబై జట్టు ప్రస్తుత చైర్మన్ సలీల్ అంకోలా, మాజీ వికెట్ కీపర్ సమీర్ దరఖాస్తు చేశారు. అయితే 50 మందిలో మణీందర్ సింగ్ (35 టెస్టులు, 59 వన్డేలు), ఎస్ఎస్ దాస్ (21 టెస్టులు, 4 వన్డేలు) మాత్రమే అందరికంటే ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడారు. తర్వాత వినోద్ కాంబ్లి (17 టెస్టులు, 104 వన్డేలు) ఉన్నాడు. మణీందర్ 2021లోనూ దరఖాస్తు చేసుకోగా, ముఖాముఖి ఇంటర్వ్యూలో అర్హత సాధించలేక పోయాడు. మదన్‌లాల్ నేతృత్వం లోని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) చేతన్ శర్మ వైపు మొగ్గు చూపింది. చేతన్, మణీందర్ ఒకే కాలంలో క్రికెట్ ఆడిన ఆటగాళ్లు. ఈసారి సెలెక్టర్ల పదవి కోసం దరఖాస్తు చేసినట్లు మణీందర్ ధృవీకరించాడు. దక్షిణ జోన్ నుంచి హైదరాబాద్ మాజీ స్పిన్నర్ కన్వల్జీత్ సింగ్ కూడా దరఖాస్తు చేశారు. పూర్తి వివరాలను బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి!?'

నేడు దెందులూరులో ప్రారంభించనున్న చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో రివర్స్ పాలన, ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు, సమస్యలు, విధ్వంసాలపై టీడీపీ 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి!?' పేరిట కార్యక్రమం తలపెట్టింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు బుధవారం ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో ప్రారంభిస్తారు. వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడం, ప్రజలతో చర్చించడం, ప్రజల తరుపున ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలతో కార్యక్రమం సాగనుంది. గ్రామస్థాయి కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నేతలు వరకు అంతా దీనిలో భాగస్వాములవుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు మూడు రోజుల పాటు మూడు జిల్లాలలో రోడ్ షోలు, సభల్లో పాల్గొంటారు. మొదటి రోజు దెందులూరు, చింతలపూడి, రెండోరోజు పోలవరం, కొవ్వూరు, మూడో రోజు నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలలో చంద్రబాబు పర్యటిస్తారు. దెందులూరు నియోజకవర్గం విజయరాయిలో బుధవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. డిసెంబరు 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీశ్రేణులు, అసెంబ్లీ, పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు ఈ కార్యక్రమాన్ని తమతమ నియోజకవర్గాల్లో మొదలుపెడతారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.